# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 2 | సంచిక : 203 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | బుధవారం 15 అక్టోబర్ 2025




## 299 చెరువులకు
# కృష్ణా జలాలు

- హంద్రీనీవాతో రాయలసీమకు జలసిరి
- సకాలంలో హంద్రీనీవా పనులు పూర్తి చేసిన అధికారులకు కితాబు
- మిగిలిన 218 చెరువులను ఫిబ్రవరిలోగా నీటితో నింపుతాం
- జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**కర్నూలు**

హంద్రీనీవా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని మొత్తం 517 చెరువులకు గాను 299 చెరువులని కృష్ణాజలాలతో నింపామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. హంద్రీ నీవా నీరుతో చెరువులు నింపే కార్యక్రమానికి సంబంధించి కర్నూలు ఇరిగేషన్ సిఈ కార్యాలయంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు సకాలంలో పూర్తి చేసిన అధికారులను - మిగతా3లో

## విశాఖలో దేశంలోనే తొలి అతిపెద్ద
# ఏఐ డేటా హబ్

- విశాఖ నుంచే ప్రపంచ దేశాలకు అనుసంధానం
- సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రుల సమక్షంలో ప్రకటించిన గూగుల్
- ఏర్పాటుపై ఎక్స్ వేదికగా ప్రకటించిన గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్
- విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- డేటా సెంటర్ విశాఖకు రావటం గర్వకారణం: సీఎం చంద్రబాబు
- సీఎం చంద్రబాబు, లోకేష్‌కు అభినందలు వెల్లువ



**ఢిల్లీ**

దేశంలోనే విశాఖలో తొలి అతిపెద్ద ఏఐ డేటా హబ్ ఏర్పాటు కాబోతోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఆంధ్రప్రదేశ్ సువర్ణ అధ్యాయం లిఖించింది. ప్రపంచాన్ని శాసిస్తున్న డేటా, ఏఐ లాంటి రంగాల్లో విశాఖ నగరం కేంద్ర బిందువు కానుంది. ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖ వేదికగా భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటించింది. అమెరికా వెలుపల అతిపెద్ద ఏఐ డేటా హబ్ ను విశాలో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. ఈమేరకు ఢిల్లీలో జరిగిన భారత్ ఏఐ శక్తి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు కోసం రానున్న ఐదేళ్ల కాలంలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టనున్నట్టు గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ ప్రకటించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ' వచ్చే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాలని గూగుల్ నిర్ణయించడం సంతోషం కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ భారీ పెట్టుబడి భారత డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లో ఒక కొత్త - మిగతా3లో



## కదులుతున్న బస్సులో మంటలు

- 12 మంది ప్రయాణికులు సజీవ దహనం..!
- కదులుతున్న బస్సులో మంటలు చెలరేగాయి
- కొద్ది నిమిషాల్లోనే బస్సంతా మంటలు వ్యాపించాయి.
- దాదాపు 20 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత, బస్సు వెనుక నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి



## సమాఖ్య వ్యవస్థకు ఏమైంది?

- ఈడీపై సుప్రీం మరోసారి సీరియస్
- "రాష్ట్ర పోలీసుల హక్కులను ఉల్లంఘించడం లేదా?
- మీకు అనుమానం వచ్చినప్పుడల్లా మీ సొంతంగా దర్యాప్తు చేస్తారా?
- ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయడం లేదా?

## బీజేపీ తొలి జాబితా రెడీ

- అంతా ఊహించినట్లుగానే బీజేపీ 101 స్థానాల్లో పోటీకి సిద్ధమవుతోంది
- ఈ నేపథ్యంలోనే భారతీయ జనతా పార్టీ మంగళవారం (అక్టోబర్ 14) ఎన్నికలకు తన మొదటి జాబితాను విడుదల
- జాబితా ప్రకారం, నంద్ కిషోర్ యాదవ్‌కు నిరాశ ఎదురైంది
- ఈ జాబితాలో మొత్తం 71 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది కమలం పార్టీ




## అందుకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందే

- బీహార్ రాజకీయ పార్టీలకు ఈసీ ఆదేశం
- ఎన్నికల ప్రచార ప్రకటనలకు పార్టీలు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచన
- రాజకీయ ప్రచారాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం కోసం ఈ చర్యలు




# ఏఐతో విక్షిత్ భారత్‌కు ముందడుగు



- విక్షిత్ భారత్‌కు విశాఖ గూగుల్ డేటా సెంటర్ గొప్ప ముందడుగు
- యువత, రైతులు, వైద్యులు, మత్స్యకారులు, మహిళలు విద్యార్థుల జీవితాలను ఏఐ ప్రభావితం చేస్తుంది
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ విక్షిత్ భారత్ కోసం నిరంతరాయంగా చేస్తున్న కృషి
- భారత్‌లో ఏఐ హబ్‌ను నిర్మించడానికి ప్రతి పౌరుడి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఈ సాంకేతికతను ఉపయోగించుకోవడానికి ఇది మన సమష్టి క్షణం

**అమరావతి**

గమ్యస్థానం నుంచి 'విక్షిత్ భారత్'కు మార్గం ఇప్పుడు సుగమం అవుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. విశాఖపట్నం 15 బిలియన్ల గూగుల్ ఏఐ డేటా సెంటర్‌ను భారతదేశపు మొట్టమొదటి ఏఐ నగరాన్ని పొందడం గొప్ప ముందడుగని అభివర్ణించారు. ఈ చొరవ అందరికీ ఏఐ శక్తి నిజంగా తెలుస్తుందని ఉద్ఘాటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు పవన్ కల్యాణ్. యువత, రైతులు, వైద్యులు, మత్స్యకారులు, మహిళలు విద్యార్థుల జీవితాలను ఏఐ ప్రభావితం చేస్తుందని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విక్షిత్ భారత్ కోసం నిరంతరాయంగా చేస్తున్న కృషి.. ఆయన దార్శనికత సృష్టించిన ప్రపంచ విశ్వాసం ప్రత్యక్ష ఫలితం ఇదని - మిగతా3లో



## 15 మిలియన్ డాలర్ల పెట్టుబడి

- మోడీతో మాట్లాడిన పిచాయ్
- భారత్ నుంచి ఆసియా దేశాలకు సేవలు
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య ఢిల్లీలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి
- గూగుల్ ఎఐ హబ్ వల్ల పెద్ద ఎత్తున క్లీన్ ఎనర్జీ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి

## ఆ భయంతోనే చంద్రబాబు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు

- 'భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి మద్యం అసలుదా.. నకిలీదా అని తెలుసుకునేలా యాప్ పెట్టలేదు
- చంద్రబాబు యాప్ పెట్టారంటే నకిలీ మద్యం ఉన్నట్లే కదా?
- చంద్రబాబు తప్పుల మీద తప్పులు చేస్తూ కూడా అడ్డంగా బుకాయిస్తున్నారు
- సడెన్‌గా ఒకడు ఆఫ్రికానుంచి వస్తాడు, అతనికి రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతారు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు పెట్టాం
- ఆ దుకాణాలకు వచ్చిన మద్యం ఏ డిస్టిలరీ నుంచి వచ్చిందో తెలుసేలా చేశాం



**తాడేపల్లి**

నకిలీ మద్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డగోలుగా బరితెగించి వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు తప్పులు మీద తప్పులు చేస్తూ కూడా అడ్డగోలుగా బుకాయిస్తున్నారని విమర్శించారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శులతో సజ్జల సమావేశమయ్యారు. 'భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి మద్యం అసలుదా.. నకిలీదా అని తెలుసుకునేలా యాప్ పెట్టలేదు. చంద్రబాబు యాప్ పెట్టారంటే నకిలీ మద్యం ఉన్నట్లే కదా..?, చంద్రబాబు తప్పుల మీద తప్పులు చేస్తూ కూడా అడ్డంగా బుకాయిస్తున్నారు. సడెన్‌గా ఒకడు ఆఫ్రికానుంచి వస్తాడు, అతనికి రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతారు. అతని వీడియో బయటికి - మిగతా3లో




## కాంగ్రెస్ కూటమికి మజ్లీస్ షాక్

- గత ఎన్నికల్లో ఓట్లు చీల్చి హస్తం కూటమికి గట్టి ఝలక్ ఇచ్చిన మజ్లీస్
- ఎంఐఎం ప్రకటించిన 32 స్థానాలు మొత్తం 16 జిల్లాలకు చెందినవి
- ముఖ్యంగా ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న సీమాంచల్ ప్రాంతంపై ఆ పార్టీ ప్రధానంగా దృష్టి సారించింది

# 15 మిలియన్ డాలర్ల పెట్టుబడి



**న్యూఢిల్లీ :** విశాఖలో గూగుల్ పెట్టబోయే పెట్టుబడి మరో ఐదు బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇప్పటి వరకూ పది బిలియన్ డాలర్లను వచ్చే ఐదేళ్లలో పెట్టుబడిగా పెడతారని అనుకున్నారు. కానీ అది పదిహేను బిలియన్ డాలర్లకు పెంచినట్లుగా ఒప్పందం సమయంలో ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య ఢిల్లీలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. విశాఖ పట్నం ంఎ హబ్ భారతదేశ డిజిటల్ భవిష్యత్తుకు ల్యాండ్ మార్క్ పెట్టుబడి ఇది అమెరికా వెలుపల మా అతిపెద్ద హబ్‌గా ఉంటుంది, భారత్‌తో పాటు ఆసియా దేశాలకు కూడా సేవలు అందిస్తుంది అని గూగుల్ క్లౌడ్ సిఇఓ థామస్ కురియాన్ ప్రకటించారు. ఈ ఒప్పందం తర్వాత గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ట్విట్టర్ లో స్పందించారు. భారత ప్రధాని నరేంద్రమోదీతో మాట్లాడాన ని.. విశాఖపట్నంలో మా మొదటి హబ్ ప్రణాళికలు పంచు కున్నానని తెలిపారు. ఇది ల్యాండ్‌మార్క్ డెవలప్‌మెంట్. గిగావాట్ స్థాయి కంప్యూట్ కెపాసిటీ, కొత్త అంతర్జాతీయ సబ్‌సీ గేట్‌వే, పెద్ద ఎత్తున ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో ఇది భారతదేశ ఆవిష్కరణలను వేగవంతం చేస్తుందని సుందర్ పిచాయ్ ప్రకటించారు. గూగుల్ ఎఐ హబ్ వల్ల పెద్ద ఎత్తున క్లీన్ ఎనర్జీ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. భారతీయ సంస్థలు, డెవలపర్లు, యూజర్లకు కట్టింగ్-ఎడ్జ్ టెక్నాలజీని అందించి, దేశవ్యాప్తంగా ఆవిష్కరణలు, ఉద్యోగాల సృష్టిని వేగవంతం చేస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న ఈ 1 గిగావాట్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ భారతదేశంలోనే అతిపెద్దది. గిగావాట్ స్థాయి కంప్యూటింగ్, ఆధారిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ? మోడల్స్ ట్రైనింగ్, డెవలప్‌మెంట్‌కు అవసరమైన సూపర్ కంప్యూటర్ స్థాయి పవర్. కొత్త అంతర్జాతీయ సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ , గూగుల్ గ్లోబల్ ఫైబర్-ఆప్టిక్ నెట్‌వర్క్‌తో ఇంటిగ్రేట్ అవుతుంది. ఇది డేటా ట్రాన్స్‌ఫర్ స్పీడ్‌ను 100 రెట్లు పెంచుతుంది. పెద్ద ఎత్తున పర్యావరణ స్నేహపూర్వక ఎనర్జీ సోర్సెస్, సోలార్ , విండ్ పవర్‌తో పనిచేస్తుంది. ఇది ఆపరేష న్‌లకు అవసరమైన భారీ ఎనర్జీని సస్టైనబుల్‌గా అందిస్తుంది. ఈ పెట్టుబడి భారత మిషన్‌కు కీలకం. ప్రొఫెషనల్స్‌కు స్కిల్ డెవలప్‌మెంట్, డిజిటల్ ఎకానమీకి బూస్ట్ ఇస్తుందని కేంద్ర మంత్రి అశ్వని వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 1.8 లక్షలకు పైగా ఉద్యోగాలు (డైరెక్ట్ ః ఇన్‌డైరెక్ట్) యువతకు లభిస్తాయి. విశాఖపట్నాన్ని గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చుతుంది. భారతీయ స్టార్టప్‌లు, సంస్థలు గూగుల్ టూల్స్ (జెమిని, వెర్సటైల్ మోడల్స్)ని ఉపయోగించి, హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్ వంటి రంగాల్లో ఆవిష్కరణలు చేయవచ్చు. అదాని గ్రూప్ కూడా గూగుల్ తో జత కట్టింది. అదాని గూగుల్ పార్ట్‌నర్‌షిప్‌తో విశాఖలో అతిపెద్ద డేటా సెంటర్ నిర్మిస్తున్నాము. డిమాండ్‌లకు స్పెషల్‌గా డిజైన్ చేసినది అని ప్రకటించారు. భారతీ ఎయిర్‌టెల్ కూడా డేటా సెంటర్ నిర్మాణంలో భాగస్వామిగా ఉంది. ప్రాజెక్ట్ 5 సంవత్సరాల్లో పూర్తవుతుంది. మొదటి ఫేజ్‌లో డేటా సెంటర్ నిర్మాణం, 2026లోపు ఆపరేషన్స్ మొదలవుతాయి. గూగుల్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లు, లోకల్ డెవలపర్ కమ్యూనిటీలకు సపోర్ట్ కూడా భాగమవుతాయి. ఈ పెట్టుబడి గ్లోబల్ టెక్ జెయింట్స్ మధ్య పోటీలో భాగం ? అమెజాన్, మైక్రోసాఫ్ట్ కూడా భారత్‌లో ఇన్‌వెస్ట్‌మెంట్స్ పెంచుతున్నాయి.

**ఏఐ హబ్ అవుతుంది**

టెక్నాలజీ ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా విశాఖపట్నానికి భారీ గుర్తింపు లభించనుంది. ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్, తమ మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌ను విశాఖలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దీనిపై గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ సోషల్ మీడియాలో స్పందించారు. భారతదేశంలో ఏఐ ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కీలక ముందడుగు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సుందర్ పిచాయ్, "విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న గూగుల్ తొలి ఏఐ హబ్ ప్రణాళికలను ప్రధాని నరేంద్ర మోదీతో పంచుకోవడం చాలా సంతోషంగా అనిపించింది. ఇవాళ జరిగింది ఒక చారిత్రాత్మక పరిణామం" అని పేర్కొన్నారు. ఈ హబ్ కేవలం ఒక కార్యాలయంగా కాకుండా, అత్యంత శక్తివంతమైన సాంకేతిక కేంద్రంగా రూపుదిద్దుకోనుందని వివరించారు. ఈ ఏఐ హబ్ ద్వారా గిగావాట్ స్థాయి కంప్యూటింగ్ సామర్థ్యం, కొత్త అంతర్జాతీయ సబ్‌సీ గేట్‌వే, భారీ ఇంధన మౌలిక సదుపాయాలను ఒకేచోట అనుసంధానించనున్నట్లు సుందర్ పిచాయ్ తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా గూగుల్ తమ అత్యాధునిక టెక్నాలజీని భారతీయ సంస్థలకు, వినియోగదారులకు మరింత చేరువ చేస్తుందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలను వేగవంతం చేయడంతో పాటు, ఆర్థిక వృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గూగుల్ తీసుకున్న ఈ నిర్ణయంతో విశాఖ నగరం గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో కీలక స్థానాన్ని సంపాదించుకోనుంది.

# బీజేపీ తొలి జాబితా రెడీ



**న్యూఢిల్లీ :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఔఅం కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చింది. అంతా ఊహించినట్లుగానే బీజేపీ 101 స్థానాల్లో పోటీకి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే భారతీయ జనతా పార్టీ మంగళవారం (అక్టోబర్ 14) ఎన్నికలకు తన మొదటి జాబితాను విడుదల చేసింది. జాబితా ప్రకారం, నంద్ కిషోర్ యాదవ్‌కు నిరాశ ఎదురైంది. రత్నేష్ కుష్వాహాకు పాట్నా సాహిబ్ నుండి పోటీ చేసే అవకాశం లభించింది. ఈ జాబితాలో మొత్తం 71 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది కమలం పార్టీ. మిగిలిన సీట్లకు అభ్యర్థులను రెండవ జాబితాలో ప్రకటిస్తారు.నంద్ కిషోర్ యాదవ్ తో పాటు, మంత్రి మోతీలాల్ ప్రసాద్ టికెట్ ఎన్నికల బరి నుంచి తప్పించారు. రామ్‌సురత్ రాయ్ టికెట్ ఔరాయ్‌కు టికెట్ దక్కలేదు. ఎమ్మెల్సీ, ఆరోగ్య మంత్రి మంగళ్ పాండే సివాన్ నుంచి బరిలోకి దిగుతున్నారు. జెడియు మాజీ ఎంపి సునీల్ కుమార్ పింటు తిరిగి బీజేపీలోకి వచ్చారు. ఆయన సీతామర్హి స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా టికెట్ దక్కించుకున్నారు తన టికెట్ కట్ అయిన తర్వాత, నంద్ కిషోర్ మాట్లాడుతూ, "నేను బీజేపీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను. పార్టీ నాకు చాలా ఇచ్చింది. పార్టీతో నాకు ఎటువంటి ఫిర్యాదులు లేవు. కొత్త తరానికి స్వాగతం." అంటూ పేర్కొన్నారు. "పాట్నా సాహిబ్ అసెంబ్లీ ప్రజలు నన్ను వరుసగా ఏడుసార్లు గెలిపించారు. బీజేపీ అభ్యర్థిగా నాపై చూపిన ఆప్యాయత, ప్రేమను నేను ఎప్పటికీ మర్చిపోలేను" అని అన్నారు.మరోవైపు, బీజేపీ ఖజౌలి నుండి అరుణ్ ప్రసాద్‌ను పోటీకి దింపింది. ఈ సీటు ఉపేంద్ర కుష్వాహాకు వెళ్తుందని చర్చ జరిగింది. తారాపూర్ నుండి టికెట్ దక్కించుకున్న తర్వాత, సామ్రాట్ చౌదరి మాట్లాడుతూ, "2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ ప్రకటించిన అభ్యర్థులందరికీ హృదయపూర్వక అభినందనలు. ప్రధాని మోదీ, సీఎం నితీష్ కుమార్ కృషి, ఔఅం ఐక్యత, అందరి కృషి కారణంగా, ప్రతి సీటులో విజయం సాధిస్తాము" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదిలావుంటే, బీహార్‌లో ఈసారి రెండు దశల్లో పోలింగ్ జరుగుతుంది. మొదటి దశ నవంబర్ 6న, రెండవ దశ నవంబర్ 11న జరుగుతుంది. మొదటి దశకు నామినేషన్ ప్రక్రియ జరుగుతోంది. అభ్యర్థులు అక్టోబర్ 17 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# కాంగ్రెస్ కూటమికి మజ్లీస్ షాక్




**పాట్నా :** హార్‌లో మరోసారి కాంగ్రెస్ కూటమికి షాక్ ఇచ్చేందుకు ఎంఐఎం సిద్ధమైంది. గత ఎన్నికల్లో ఓట్లు చీల్చి హస్తం కూటమికి గట్టి ఝలక్ ఇచ్చిన మజ్లీస్.. ఈ సారి కూడా ఎన్నికల బరిలో నిలిచింది. ఇప్పటికే అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో 32 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. సాధారణంగా ప్రధాన పార్టీలు పాట్నా నుంచి జాబితాలు ప్రకటిస్తుండగా.. ఎంఐఎం ఆ సంప్రదాయాన్ని పక్కన పెట్టి ముస్లిం జనాభా అధికంగా ఉన్నకిషన్‌గంజ్‌లోని సింఘియా ప్రాంతంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఈ జాబితాను ప్రకటించడం గమనార్హం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్, జాతీయ ప్రతినిధి ఆదిల్ హుసైన్ కలిసి మీడియా ముందు అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. ఎంఐఎం ప్రకటించిన 32 స్థానాలు మొత్తం 16 జిల్లాలకు చెందినవి. ముఖ్యంగా ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న సీమాంచల్ ప్రాంతంపై ఆ పార్టీ ప్రధానంగా దృష్టి సారించింది. కిషన్‌గంజ్, కోచాధామన్, బహదుర్‌గంజ్, ఠాకుర్‌గంజ్, అమౌర్, బాయసీ, కస్బా, బలరాంపూర్, ప్రాణ్‌పూర్, మనిహారి, బరారి, కద్వా, హాట్, అరరియా నియోజకవర్గాలు దీన్ని పరిధిలోకి వస్తాయి. సీమాంచల్‌తో పాటు గయా, దర్భంగా, భాగల్పూర్, సివాన్, గోపాల్‌గంజ్ వంటి ఇతర జిల్లాల్లో కూడా అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే లక్ష్యాన్ని ఎంఐఎం స్పష్టం చేసింది.

**ఆర్జేడీతో పొత్తు ప్రతిపాదన విఫలం..!**

పార్టీ అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్ర రాజకీయాల్లో మూడో ఫ్రంట్‌గా రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. సెక్యులర్ ఓట్ల విభజన×× జరగకుండా ఉండేందుకు తాము ఆర్జేడీతో పొత్తుకు ప్రతిపాదనలు పంపించామని.. కానీ వారు స్పందించకపోవడంతో స్వతంత్రంగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమానత్వం, ప్రాంతీయ సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. త్వరలో విడుదల చేసే మిగతా జాబితాలలో మహిళలకు గౌరవప్రదమైన ప్రాతినిధ్యం కల్పిస్తామని ఇమాన్ హామీ ఇచ్చారు. ఎంఐఎం ఈ నిర్ణయం ద్వారా సీమాంచల్ ప్రాంతాన్ని తమ మద్దతు బేస్‌గా మార్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత ఎన్నికల్లో కిషన్‌గంజ్‌లో విజయం సాధించిన ఎంఐఎం, ఈసారి మరిన్ని స్థానాల్లో విజయంపై దృష్టి సారించింది.ఎంఐఎం ఏకపక్ష నిర్ణయం కారణంగా ముస్లిం ఓట్లు చీలిపోయి ఆర్జేడీ ? కాంగ్రెస్ కూటమికి నష్టం జరగడంతో పాటు రాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ తొలి జాబితా విడుదల బీహార్ ఎన్నికల వాతావరణాన్ని మరింత వేడెక్కించింది.

## కదులుతున్న బస్సులో మంటలు



రాజస్థాన్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కదులుతున్న బస్సులో మంటలు చెలరేగాయి. దాంతో పది నుంచి 12 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వివరాల్లోకి వెళితే.. జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వెళ్తున్న ప్రైవేటు బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు పిల్లలు, నలుగురు మహిళలు ఉన్నట్లుగా తెలుస్తున్నది. గాయపడ్డ వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. తీవ్రమైన గాయాలైన వారిని జోధ్‌పూర్‌కు తరలించారు. కదులుతున్న బస్సుల్లోనే ఒక్కసారిగా పొగలు వచ్చాయి. కొద్ది నిమిషాల్లోనే బస్సంతా మంటలు వ్యాపించాయి. సమాచారం మేరకు.. జైసల్మేర్-జోధ్‌పూర్ హైవేలోని థైయత్ గ్రామం సమీపంలో మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 57 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు ఎప్పటిలాగే మధ్యాహ్నం 3 గంటలకు జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్‌కు బయలుదేరింది. దాదాపు 20 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత, బస్సు వెనుక నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్, ప్రయాణికులు తేరుకునే లోపే బస్సంతా మంటలు వ్యాపించాయి. బస్సులో ఉన్న చిక్కుకున్న వారంతా కేకలు వేశారు. పలువురు ప్రయాణికులు కిటికీలు పగులగొట్టి బయటపడ్డారు. చాలా మంది లగేజీ అంతా మంటల్లో కాలిపోయింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులంతా అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్, పోలీసు సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వేగంగా స్పందించి ఫైర్ ఇంజిన్లతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే, బస్సులో మంటలు వ్యాపించడానికి కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బస్సు ఇంజిన్ లేదంటే వైరింగ్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రమాదంలో చాలామంది ప్రయాణికు ముఖాలు, చేతులు, కాళ్లు, పలుచోట్ల కాలిన గాయాలయ్యాయి.

## సమాఖ్య వ్యవస్థకు ఏమైంది?



తమిళనాడు మద్యం కుంభకోణం ఆరోపణలపై దర్యాప్తు జరుపుతోన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి అసహనం వ్యక్తం చేసింది. ఈ విషయంలో దర్యాప్తు చేస్తున్న రాష్ట్ర పోలీసుల హక్కులను లాగేసుకోవడం లేదా? అని ప్రశ్నించింది. ఈ సందర్భంగా సమాఖ్య వ్యవస్థ సంగతేంటని మరోసారి నిలదీసింది. "రాష్ట్ర పోలీసుల హక్కులను ఉల్లంఘించడం లేదా? మీకు అనుమానం వచ్చినప్పుడల్లా మీ సొంతంగా దర్యాప్తు చేస్తారా? సమాఖ్య వ్యవస్థకు ఏమైంది..? ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయడం లేదా? శాంతి భద్రతలను ఎవరు నియంత్రిస్తారు. గత ఆరేళ్లలో ఈడీకి సంబంధించి ఎన్నో కేసులు చూశాను. మళ్లీ నేనేం చెప్పదలచుకోలేదు" అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. తమిళనాడులో మద్యం రిటైలర్ 'టాస్మాక్'లో అవకతవకలకు సంబంధించి రాష్ట్ర పోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోదాలు జరిపింది. మే నెలలో సంబంధిత అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. చివరకు ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరుకుంది. విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఈడీ అన్ని హద్దులు దాటుతోందని, సమాఖ్య పాలన భావనను ఉల్లంఘిస్తోందని ఆక్షేపించింది. టాస్మాక్‌పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తుపై స్టే విధించగా.. తాజాగా విచారణ పునఃప్రారంభించింది. ఈ నేపథ్యంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం మరోసారి ఈడీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది.

## అందుకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందే




బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం లో కేంద్ర ఎన్నికల కమిషన్ అక్కడి రాజకీయ పార్టీలకు కీలక ఆదేశా లు జారీచేసింది. ఎన్నికల ప్రచార ప్రకటనలకు పార్టీలు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకో వాలని సూచించింది. ఈ మేరకు మంగళవారం అన్ని పార్టీలకు మార్గదర్శకాలు ఇచ్చింది. అభ్యర్థులు సోషల్ మీడియాతో సహా ఎలక్ట్రానిక్ లేదా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఏదైనా రాజకీయ ప్రకటనలను ప్రచురించడానికి లేదా ప్రసారం చేయడానికి ముందు మీడియా సర్టిఫికేషన్ తీసుకోవడం, మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు ధ్రువీకరణ పత్రం పొందడాన్ని ఈసీ తప్పనిసరి చేసింది. రాజకీయ ప్రచారాల్లో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని ప్రోత్సహించడం కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు ఈసీ అధికారులు పేర్కొన్నా రు. రాజకీయ ప్రకటనల కోసం ముందస్తు ధ్రువీకరణ ప్రక్రియను పర్యవేక్షించడానికి జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీలను ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రాజకీయ పార్టీలపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన 75 రోజులలోపు ప్రచార ఖర్చుల పూర్తి వివరాలను రాజకీయ పార్టీలు సమర్పించాలని ఈసీ సూచించింది.

# విశాఖలో దేశంలోనే తొలి అతిపెద్ద ఏఐ డేటా హబ్



-మొదటిపేజీ తరువాయి

అధ్యాయం. దేశంలో మొదటి గిగావాట్%-%స్కేల్ డేటా సెంటర్ విశాఖకు రావటం ఏపీకి గర్వకారణం. రియల్ టైమ్ డేటా, హిస్టారికల్ డేటాల సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని భారత్ వేగంగా అందిపుచ్చుకుంటుంది. ఏపీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ను ప్రతీ కుటుంబానికీ దగ్గర చేసేలా ప్రయత్నిస్తాం. హైటెక్ సిటీ నిర్మాణంతో హైదరాబాద్ దశ మారింది. ఇప్పుడు విశాఖలో ఏఐ డేటా హబ్ రాకతో ఏపీ దశ మారుతుంది. ప్రధాని మోదీ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకుంటారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు గురించి చెప్పగానే ఆయన వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గ్లోబల్ ఏఐ కాన్ఫరెన్సు నిర్వహించే విషయమై ఆలోచన చేశారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటుకు సహకరించిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్ లకు ధన్యవాదాలు. ఇంతటి భారీ పెట్టుబడిని ఏపీకి తీసుకురావటంలో ప్రధాన పాత్ర పోషించిన ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు అభినందనలు' అని ముఖ్యమంత్రి అన్నారు. విశాఖలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేయబోతున్నట్టు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ కెపాసిటీ, సబ్ సీ గేట్ వే సహా భారీ స్థాయి ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు కోసం 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్టు తెలిపారు. దేశ ప్రగతిలో ఈ పెట్టుబడి, ఏఐ డేటా సెంటర్ కీలకంగా మారబోతున్నట్టు సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రధాని మోదీతో మాట్లాడినట్టు సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. దేశంలో డేటా సెంటర్ పాలసీ ద్వారా ఈ తరహా డేటా సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయని అన్నారు. ఏఐ డేటా హబ్ ఏర్పాటుతో గ్లోబల్ కనెక్టివిటీ హబ్ గా విశాఖ మారుతుందని గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ వ్యాఖ్యానించారు. ఈ డేటా సెంటర్ ద్వారా వివిధ సంస్థలకు సరైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. భారత్ తో పాటు వివిధ దేశాలను అనుసంధానించేందుకు విశాఖలోని డేటా హబ్ వేదిక అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు , రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఎంపి లుగూగుల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా 2030 నాటికి గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని భారత కరెన్సీలో (రూ.1.33 లక్షల కోట్లు) విశాఖలో పెట్టనుంది. అమెరికా వెలుపల ప్రపంచంలోనే భారీ పెట్టుబడిగా గూగుల్ సంస్థ స్పష్టం చేసింది. గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ సామర్ధ్యంతో ఏఐ డేటా హబ్ ను గూగుల్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. గూగుల్ జెమిని ఏఐ, గూగుల్ సెర్చ్, గూగుల్ వర్క్ స్పేస్ , యూట్యూబ్, క్లౌడ్, జీమెయిల్ లాంటి సేవలను ఈ హబ్ ద్వారా అందించనుంది. భారత్ దేశంతో పాటు దక్షిణాసియా దేశాలైన సింగపూర్, మలేసియా సహా ఆస్ట్రేలియా లాంటి దేశాలకు విశాఖ ఏఐ డేటా హబ్ నుంచే గూగుల్ సేవలు అందనున్నాయి. మొత్తంగా విశాఖ నుంచి 12 దేశాలకు కనెక్టివిటీ ఏర్పాటు చేసుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను గూగుల్ సమకూర్చుకోనుంది. ఇందులో భాగంగా సబ్ సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ నిర్మిస్తోంది. రెండు మిలియన్ మైళ్ల కంటే పొడవైన సబ్ సీ కేబుల్ ద్వారా ప్రపంచానికి కనెక్టివిటీ కేంద్రంగా విశాఖ మారనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గూగుల్ యూజర్లకు మరింత వేగంగా సేవలు అందించేలా ఈ ఏఐ డేటా హబ్ సేవలు అందించనుంది.

**సీఎం చంద్రబాబు, లోకేష్‌కు అభినందలు వెల్లువ**

ఢిల్లీలో గూగుల్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం అమరావతి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, నేతలు ఘనస్వాగతం పలికారు. థాంక్యూ సీఎం సార్, గూగుల్ కమ్స్ టు ఏపీ నినాదాలతో కూడిన ప్లకార్డులతో నేతలు స్వాగతం పలికారు. ఏపీకి గూగుల్ సంస్థను తీసుకొచ్చేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# 22 ఏ కిందకు ఎకరాల భూమి

# అమ్మకోలేరు.. వాడుకోలేరు



**ఏలూరు :** కొరందరికీ ఎకరాల కొద్దీ భూమి ఉంది. కానీ ఏదైనా అత్యవసం అయితేనో.. ఆడబిడ్డకో ఇవ్వలేరు.. వారసులకు పంచలేరు. చుట్టూ నీరున్నా.. తాగడానికి పనికి రాదు అన్న చందంగా ఉంది వారి పరిస్థితి. ఎకరాల కొద్దీ భూములున్నా అవన్నీ 22ఎ(నిషేధిత ఆస్తుల) జాబితాలో ఉండటంతో.. ఇటు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేక భూ యజమానులు నరకం చూస్తున్నారు. అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధుల భూములు చేతులు మారినా.. గత ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌లో పెట్టి అమ్మకాలు ఆపేసింది. సుమారు 15 వేల ఎకరాల భూములు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి.భూమి ఉంటే మనిషికి కొండంత భరోసా. ఎంత పెద్ద కష్టం వచ్చినా సరే.. తీర్చుకోవచ్చు అనే ధీమా ఉంటంది. చిన్న చిన్న అక్కర్లకు అయితే భూమిని తాకట్టు పెట్టి రుణం పొందవచ్చు. పెద్ద సమస్య వస్తే.. భూమిని అమ్ముకుని కష్టం నుంచి బయపడవచ్చు. ఆడబిడ్డ పెళ్లికి కట్నంగా కూడా ఇవ్వొచ్చు. భూమి ఉంటే మనిషికి తల్లి దగ్గర ఉన్నంత భరోసా ఉంటుంది. కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే రైతులది విచిత్రమైన పరిస్థితి. వారందరి పేరు మీద వేల ఎకరాల భూములున్నా.. వారికి అక్కరకు రాకుండా పోతున్నాయి. పోని వారసులకు పంచుదామా అంటే దానికి వీలు లేకుండా ఉంది. అసలేంటి సమస్య అంటే..పశ్చిమ గోదావరి జిల్లాలోని చాలా మంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. వారి పేరు మీద ఎకరాల కొద్దీ భూములున్నా.. ఇటు ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేని దుస్థితిలో ఉన్నారు. కారణం వారి భూములు 22ఎ జాబితాలో ఉండటం. అదేలా జరిగింది అంటే.. ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్స్ ఈ జాబితాలోకి వస్తాయి. ఈ భూములను అమ్ముకోలేరు.. వారసులకు పంచలేరు.మండలంలో అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులకు కేటాయించిన భూములను కొందరు అమ్ముకున్నారు. ఈ భూములు పలుమార్లు చేతులు మారాయి. అయితే గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ భూములను ఫ్రీహోల్డ్‌లో పెట్టింది. వాటి అమ్మకాలు, కొనుగోళ్లను నిలిపివేసింది. ఈ భూములకు సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, అడంగల్ పత్రాలు, పాస్‌పుస్తకాలు వంటివి ఉన్నా సరే.. పాలకుల నిర్ణయాల వల్ల సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యను పరిష్కరిస్తుందని వారు ఆశించారు. కానీ రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఈక్రమంలో తాజాగా పెదవేగి మండలానికి చెందిన కొందరు.. కోర్టు అనుమతితో భూములను రిజిస్టర్ చేయించుకున్నారు. అయితే ఈ సమస్య ఎదుర్కొంటున్న అందరూ ఇలా కోర్టుకు వెళ్లడం సాధ్యం కాదు. కనుక ప్రభుత్వమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. పెదవేగి మండలంలోనే అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటుంది. ఈ భూముల సమస్యలను పరిష్కరించాలని బాధితులు పీజీఆర్ఎస్‌లోనూ విన్నవించుకున్నారు. అయినా ప్రయోజనం లేదని తెలుస్తోంది. ఈ భూములపై ప్రతి వారం కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. సరైన పత్రాలు ఉన్న భూములను ఈ జాబితా నుంచి తొలగిస్తామని వెల్లడిం చారు. వాటి క్రయ, విక్రయాలకు అవకాశం కల్పిస్తున్నామని.. ఈ మేరకు తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చామని వారు పేర్కొన్నారు

# పిడిఎఫ్ బియ్యం గుర్తించేందుకు 700 రాపిడ్ టెస్టింగ్ మొబైల్ కిట్లు

**విజయవాడ :** రాష్ట్రంలోని వేర్వేరు పోర్టుల ద్వారా పిడిఎఫ్ బియ్యం.. విదేశాలకు తరలిపోతోంది. పౌరసరఫరాల అధికా రుల తనిఖీల్లో అనేక సందర్భాల్లో ఈ విషయం బయట పడింది. కేసులు కూడా పెట్టారు. కాకినాడ పోర్ట్ లో రేషన్ బియ్యం వ్యవహారంలో సిట్ ఎంక్వయిరీ కూడా నడుస్తోంది. ఇక విశాఖ పోర్టు నుంచి కూడా బియ్యం విదేశాలకు తరలిపోతుందనేది పౌరసరఫరాల శాఖ గట్టిగా నమ్ముతుంది. ఇటీవల తరలించేందుకు గోడౌన్లో సిద్ధంగా ఉంచిన బియ్యన్ని కూడా అధికారులు గుర్తించారు. ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్‌మెంట్ ను మరింత పటిష్టం చేశారు.నిఖీ చేస్తున్న సమయంలో ఆ బియ్యంపై అనుమానం వస్తే వాటిని ల్యాబ్ కు పంపి పరీక్షలు చేసిన తర్వాత మాత్రమే వాటిపై ఒక నిర్ధారణకు రావాల్సి ఉంటుంది. ఆ రిపోర్టు వచ్చేలోగా ఈ రవాణా సంబంధిత సమస్యలు ఎదురవుతున్నాయి అనేది.. గతంలో అనేకమంది ఎగుమతిదారులు పౌరసరఫరాల మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అయితే.. వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం సంస్కరణలు తీసుకువచ్చింది.. బియ్యం పై అనుమానం వచ్చిన వెంటనే చెక్ చేసి అప్పటికప్పుడు నిర్ధారించుకునేలా ఓ సరికొత్త ప్రణాళికనూ సిద్ధం చేసింది ప్రభుత్వం. పౌరసరఫరాల శాఖ ప్రత్యేక మొబైల్ ర్యాపిడ్ కిట్లను రంగంలోకి దింపింది. 700 రాపిడ్ టెస్టింగ్ మొబైల్ కిట్లను సిద్ధం చేసింది. వాటిని పౌరసరఫరాల శాఖ అధికారులకు నుంచి ఎన్ఫోర్స్మెంట్ పటిష్టం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్..పౌరసరఫరాల శాఖలో గత సంవత్సర కాలంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా నాణ్యమైన పోర్టిఫైడ్ రైస్ ప్రజలకు అందిస్తున్నందని.. ప్రభుత్వం అందించే బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పిడిఎస్ బియ్యం అవునో కాదో గుర్తించడానికి 700 మొబైల్ రాపిడ్ కిట్స్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ రాపిడ్ కిట్లలో పొటాషియం థయో సైనైడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ బాటిల్స్ ఉంటాయని అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పోర్టిఫైడ్ రైస్ అయినట్లయితే.. ఈ ద్రావణాలు ఆ బియ్యంపై చల్లితే అవి ఎరుపు రంగుకు మారుతాయని.. బయట దుకాణాల్లో అమ్మే బియ్యం అయితే రంగు మారవు అని తెలిపారు. గతంలో అయితే అక్రమ బియ్యం పట్టుకున్న తర్వాత ల్యాబ్ కి పంపించడం వలన సమయం ఎక్కువగా తీసుకోవడం కోర్టులో నిరూపణ కష్టమయ్యేదని.. ఈ రాపిట్ కిడ్స్ వల్ల వెంటనే గుర్తించడానికి.. సీజ్ చేయడానికి వీలు కలుగుతుందన్నారు మంత్రి.ఎన్ఫోర్స్మెంట్లో రాజీ పడేది లేదని, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని.. అవకతవకలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే పౌర సరఫరాల విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నామన్నారు. బియ్యం తీసుకొచ్చే వాహనాలను నిరంతరం తనిఖీ చేయడానికి విశాఖ పోర్టు ప్రాంతంలో మూడు అంతర్గత చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గాజువాక గేట్ వే సి.ఎఫ్.ఎస్. షీలా నగర్ వద్ద, శ్రవణ్ సి.ఎఫ్.ఎస్. షీలా నగర్ వద్ద, బిపిఎల్ ఇంటిగ్రల్ సి.ఎఫ్.ఎస్. పెదగంట్యాడ లలో మూడు చెక్పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే అవి పని చేయడం ప్రారంభించాయని చెప్పారు. కాకినాడ పోర్టులో గతంలో జరిగిన అక్రమ రవాణా జరిపిన వారిపై చట్ట పరమైన చర్యలు.. వాహనాలు సీజ్ చేయడం జరిగిందని అన్నారు. మన దేశానికి సంబంధించిన పీడీఎస్ రైస్ మన పోర్టుల నుండి అక్రమ రవాణా జరగకూడదని.. అందుకే చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని.. ఈ విధానం కాకినాడలో విజయవంతంగా అమలు చేశామన్నారు.

## రైతులు పంట కోత ప్రయోగాలు చేస్తేనే పంట బీమా వర్తిస్తుంది.

**వ్యవసాయ అధికారి భారతి**

తనకల్లు, రిపోర్టర్ రవీంద్ర(శుభోదయం న్యూస్):



రైతు సాగు చేసిన పంట పొలాలలో పంట కోత ప్రయోగాలు చేయడం ద్వారా రైతులకు పంట బీమా వర్తిస్తుందని వ్యవసాయ అధికారి భారతి మరియు గణాంకాధికారి భాస్కర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో పంట కోత ప్రయోగాల పై ఆర్ ఎస్ కె సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. అనంతరం ఏఎస్ఓ రెడ్డివారి పల్లి గ్రామ రైతు అయిన మస్తాన్ గారి పొలం నందు పంటకోత ప్రయోగంపై ఆర్ ఎస్ కె సిబ్బందికి వివరించారు. ఈనెల 25 లోగా పంట కోత ప్రయోగాలు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ మరియు రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## పకృతి వ్యవసాయ పొలాలను సందర్శించిన ఎన్ ఎఫ్ ఏ నరసింహారెడ్డి

బ్రహ్మంగారిమఠం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):




బ్రహ్మంగారి మఠం మండలం చౌదర వారిపల్లి క్లస్టర్ లో సోమవారం ప్రకృతి వ్యవసాయ పొలాలను ఎన్ఎఫ్ఏ నరసింహారెడ్డి సందర్శించ టం జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుతడి ఎడబ్లుడి విధానాన్ని పరిశీలించి రైతులు అవలంబిస్తున్న విధానాన్ని వారితో మాట్లాడి దానివల్ల కలిగే ఉపయోగాలను రైతులకి క్లుప్తంగా వివరించడం జరిగినది మొదటిగా రైతులకు ఆరుతడి పంటలు వరిలో ఈ పద్ధతి పాటించడం వల్ల నీరు ఆదావడం వరిలో పిలకల శాతం పెరుగుతాయని అలాగే చీడ పీడ నివారణ శ్రమ అధిక దిగుబడి సాధించవచని తెలియజేయడం జరిగింది రైతులు కూడా ఈ విధానంపై వారి అభిప్రాయాన్ని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎం టి వీరనారాయణ డిఎంఎంటి శ్రీనివాసులు యూనిట్ ఇంచార్జ్ గోపాలమ్మ డిజిటల్ వెంకటరమణారెడ్డి ఐ సి ఆర్ పి లు రైతులు పాల్గొన్నారు..

## జిఎస్టి.సూపర్ సేవింగ్స్ పై ప్రజా అవగాహన ర్యాలీ చేసిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

నెల్లూరు జిల్లా, ప్రతినిధి శ్రీనివాసులు(శుభోదయం న్యూస్):



సైదాపురం మండల కేంద్రంలో జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై ప్రజా అవగాహన కొరకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సైదాపురం బస్టాండ్ సెంటర్ నుండి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి జీఎస్టీ 2.0 సంస్కరణలు పై సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ పై మండల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం ఈ కార్యక్రమంలో రాష్ట్ర అభివృద్ధి కొరకు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి తీసుకువచ్చిన పరిశ్రమలు మరియు అభివృద్ధి యువతకు ఉద్యోగ అవకాశాలు పలు అంశాల గురించి వివరించినారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో ఎన్. వి రామ్మోహనరావు, తాసిల్దార్ సుభద్ర మరియు జడ్పిటిసి చిత్తలూరు పోలయ్య నియోజకవర్గ ఇన్చార్జ్ మండల నాయకులు సుబ్రహ్మణ్యం రాజు. సొసైటీ అధ్యక్షులు ఏ సుబ్రహ్మణ్యం నాయుడు మండల నాయకులు దిలీప్ నాయుడు వరద బండి వెంకటేశ్వర్ల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే చిర్రి - గడ్డమణుగు

జీలుగుమిల్లి(శుభోదయం న్యూస్):



మండలం లోని తాహసిల్దార్ కార్యలయం ఎదుట ఈ నెల 22 వ తేదీన జరిగే గిరిజన ఉద్యమ నాయకుడు కొమరం భీమ్ విగ్రహ ఏర్పాటు చేసే స్థలాన్ని, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ స్థలాన్ని పరిశీలిం చారు. జరుగుతున్న పనులు పై ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆరతీసి పలు సూచనలు తెలియజేసారు. కొమరం భీమ్ విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు చిర్రి శ్రీను, పద్దం వెంకటకృష్ణ, తెల్లం హేమంత్ మాట్లాడుతూ ఈ నెల 22 వ తేదీన కొమరం భీమ్ జయంతి సందర్భంగా విగ్రహాన్ని పోలవరం ఎమ్మెల్యే బాలరాజు చేతుల మీదుగా అంగరంగా వైభవం గా ప్రారంభిస్తారని తెలిపారు. జీలుగు మిల్లి హెచ్ పెట్రోల్ వద్ద నుండి, విగ్రహ ఏర్పాటు స్థలం వరకు రేలీగ వెళ్లిన అనంత రం, సభను ఉద్దేశించి పలువురు గిరిన నాయకులు కొమరం భీమ్ గురించి ప్రసంగి స్తారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, కొమరం భీమ్ కమిటీ సభ్యులు చిర్రి వెంకటేశ్వరావు, తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండి రాజకీయ చైతన్యం కలిగి ఉండాలి

**బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఉండవల్లి శ్రీనివాస్ రావు, బిసి వెల్ఫేర్ రాష్ట్ర నాయకులు ద్రాక్షారపు సూరి బాబు**

చీరాల, (శుభోదయం న్యూస్):




విద్యార్థి దశ నుండి రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరు తమ ప్రాంతంలో సమస్యలపై అవగాహన కలిగి ఉండి, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకొని ముందుకు వెళ్లాలని బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఉండవల్లి శ్రీనివాస్ రావు, బిసి వెల్ఫేర్ రాష్ట్ర నాయకులు ద్రాక్షారపు సూరి బాబు యువతకు పిలుపునిచ్చారు.చీరాలలోని ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ నందు చీరాల ప్రజాసంఘాల సహకారంతో రాజకీయ శిక్షణ తరగతులలో భాగంగా బహుజన పాత్ర-సామాజిక బాధ్యత – రాజకీయ ప్రాధాన్యత అనే అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం నుండి వచ్చిన ఉండవల్లి శ్రీనివాసరావు, విజయవాడ నుండి వచ్చిన ద్రాక్షారపు సూరిబాబు అధ్యక్షత వ్యవహరించారు, శిక్షణా తరగతులకు కోఆర్డినేటర్ గా కాకినాడ నుండి వచ్చిన బిసి వెల్ఫేర్ రాష్ట్ర నాయకులు సత్యకృష్ణ , రిఫార్మ్స్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు విజయ్ బాధ్యతలు నిర్వహించారు సభ అధ్యక్షులుగా ఉటుకూరి వెంకటేశ్వర్లు నిర్వహించారు. చుండూరు వాసు మరియు డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతు రాజ్యాంగం పట్ల మరియు అన్ని ప్రభుత్వ వ్యవస్థల మీద తీరిటికల్ మరియు ప్రాక్టికల్ నాలెడ్జిని పెంచుకోవాలని, ఇతరుల సమస్యను మన సమస్యగా భావించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపేరు. ఈ కార్యక్రమానికి సీనియర్ సిటిజషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గాదె హరిహరరావు, మార్కాపురం వెంకటరామారావు ,కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరు వాసు, చీరాల బిజెపి నాయకులు డాక్టర్ తాడివలస దేవరాజు, తడవర్తి రఘు, జనసేన నాయకులు గూడూరి శివప్రసాద్, చైతన్య మనో వికాస్ చైర్మన్ వెంకన్న బాబు, జన జాగృతి సభ్యులు రాధాకృష్ణ మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# పోటీల్లో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు విజయభేరి






బాపట్ల జిల్లా(శుభోదయం న్యూస్):

ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయ పరిధిలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు విజయ దుందుభిని మోగించారు. యోగాసనాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి శ్రీ పి. డి. వరుణ్ రాజ్ మరియు కుమారి పి. శ్రావణి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మరో విద్యార్థిని కుమారి పి. శ్రావ్య తృ తీయ బహుమతిని పొందారు.విజేతలు గా నిలిచిన ఈ విద్యార్థులు డిసెంబర్ లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. యన్.రమా దేవి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. డిసెంబర్ 24 నుండి 28 వరకు జరిగే జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనటానికి సంసిద్ధులవుతున్నారు. వీటిని వెల్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మరియు యస్. వి. వై. యస్. ఏ యూనివర్సిటీ వారు నిర్వహించబోతున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాంకేతిక విద్యారంగంలోనే కాకుండా క్రీడా రంగం లోనూ తమ ప్రతిభను చాటి, రాణించటం ఎంతో ఆనందదాయకమని అన్నారు. క్రీడలు మనోవికాసానికి పరిపూర్ణ వ్యక్తిత్వ సాధనకు ఉపకరిస్తాయని అన్నారు.బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ మానం నాగేశ్వరరావు విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తూ, విద్యార్థులను ప్రోత్సహించడంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ జాయింట్ సెక్రెటరీ శ్రీ దొడ్డపనేని వెంకయ్య చౌదరి పాల్గొని విజేతలను అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్నటువంటి కళాశాల ప్రిన్సిపాల్ కి బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ యాజమాన్యానికి పీ.డి డాక్టర్ వి.మల్లికార్జున రావు తమ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# 'ఆ భయంతోనే చంద్రబాబు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు'

-మొదటిపేజీ తరువాయి

వస్తుంది, జోగి రమేష్ పేరు చెబుతాడు.. అతను చెప్పినందుకే చేశానంటాడు, నకిలీ మద్యం కేసులో చంద్రబాబు అడ్డం దొరికారు. ఆ భయంతో అడ్డగోలుగా వ్యవహరి స్తున్నారు. బెల్ట్ షాప్‌లు ఉన్నాయని చంద్రబాబే ఒప్పుకున్నారు.. కల్తీ మద్యాన్ని అసలు మద్యంలా చూపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు పెట్టాం.. ఆ దుకాణాలకు వచ్చిన మద్యం ఏ డిస్టిలరీ నుంచి వచ్చిందో తెలుసేలా చేశాం. దాని అమ్మకం జరిగితేనే డిస్టిలరీకి డబ్బులు వెళ్ళే విధంగా క్యూఆర్ కోడ్ పెట్టాం. పక్కాగా పకడ్బందీగా లిక్కర్ సేల్స్ జరిగాయి. టీడీపీ ప్రభుత్వం కల్తీ మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నారు. 24 గంటలు బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లు పెట్టి నకిలీ మద్యం ఏరులై పారిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ధీటుగా ఎదుర్కోవాలి. 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి. ఎన్ని కష్టాలు ఎదురైనా ఉవ్వెత్తున ఎగిసి పడి మనం పోరాటాలు చేస్తున్నాం. చంద్రబాబు గ్యాంగ్ బరితెగించి అడ్డగోలుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాలి. పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం అయ్యేలా యాప్‌ను కూడా సిద్ధం చేశాం.. డేటా ప్రొఫైలింగ్ జరుగుతుంది. స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా పూర్తిస్థాయిలో సిద్దంగా ఉండాలి. పార్టీ కమిటీలు, సంస్థాగత నిర్మాణం విషయంలో పుంగనూరు, మడకశిర నియోజకవర్గాలను మోడల్ గా తీసుకుని ముందుకెళ్ళాలి. మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహిస్తే నష్టమని చంద్రబాబు అంటున్నారు పీపీపీలో మెడికల్ కాలేజీలు మంచిదని చెబుతున్నాడు.. ఇంతకంటే దారుణం ఇంకేమైనా ఉంటుందా?' అని సజ్జల ప్రశ్నించారు.

# 299 చెరువులకు కృష్ణా జలాలు

అందరినీ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. చివరన ఉన్న కుప్పం వరకు కష్ణాజలాలు తరలి వెళ్ళడంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. రాయలసీమకు గుండెకాయ అయిన హంద్రీనీవా ప్రాజెక్ట్ ని గత ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం ఆటకెక్కించింది అన్నారు. ఆ ప్రభుత్వం ఐదేళ్లలో చేయనిది, కూటమి ప్రభుత్వం సంవత్సరంలో చేసి చూపించిందని రామానాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లన్ని 961 టిఎంసిల సామర్థ్యం ఉంటే 844 టీఎంసీలతో వాటిని నింపగలిగామన్నారు. అంటే 87.86% నీటిని నిల్వ చేయగలిగామని వివరించారు. అలాగే రాయలసీమలోని మొత్తం 38 నియోజకవర్గాల పరిధిలో హంద్రీనీవా ప్రాజెక్టు కాలువలు విస్తరించి ఉన్నాయి అన్నారు. ఈ కాలువలకు అనుబంధంగా 517 చెరువులు ఉన్నాయి. వీటిలో 174 చెరువులు పూర్తిగా, 125 చెరువులు పాక్షికంగా అంటే మొత్తం 299 చెరువులు నింపగలిగామన్నారు. మిగిలినవి ప్రాధాన్య క్రమంలో ఫిబ్రవరి మాసానికల్లా నింపుతామన్నారు. సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, ప్రాజెక్టు సిఈలు కబీర్ భాషా నాగరాజు, ఎస్ఈలు, ఈఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాలిటిక్స్‌లోకి షర్మిళ కుమారుడి ఎంట్రీ

**కడప :** ప్రతి రాజకీయ నాయకుడు తన వారసత్వాన్ని అందించే ప్రయత్నం చేస్తారు. ఎందుకంటే రాజకీయం అంటే గౌరవంతో కూడిన ఒక రకమైన వ్యాపారం కూడా. అయితే బడా నాయకుల వారసత్వం విషయంలో పెద్దపెద్ద కుటుంబాల మధ్య గొడవ జరగడం అనేది సర్వసాధారణం. అటువంటి పరిస్థితి వైయస్ రాజశేఖర్ రెడ్డికుటుంబానికి ఎదురైంది. తండ్రి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీతో విభేదించి సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి పదవిని కూడా అలంకరించారు. మరోవైపు కుమార్తె షర్మిల సైతం తెలంగాణలో తండ్రి పేరుతో పార్టీని ఏర్పాటు చేశారు. వర్కౌట్ కాకపోవడంతో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ పగ్గాలు తీసుకున్నారు. సోదరుడు జగన్మోహన్ రెడ్డితో విభేదిస్తూ ముందుకు సాగుతున్నారు షర్మిల.మొన్న ఆ మధ్యన షర్మిల తన కుమారుడు రాజారెడ్డిని తన వెంట తీసుకొచ్చారు. దీంతో రాజారెడ్డి పొలిటికల్ ఎంట్రీ ఉంటుందని ప్రచారం ప్రారంభం అయింది. దానిపై షర్మిల మాట్లాడుతూ కచ్చితంగా రాజారెడ్డి రాజకీయాల్లోకి వస్తారని తేల్చి చెప్పారు. వస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా రాజశేఖర్ రెడ్డి నిజమైన వారసుడు తన కుమారుడు అని ప్రకటించారు. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌంటర్ ఇవ్వడం ప్రారంభించారు. రాజశేఖర్ రెడ్డి నిజమైన వారసుడు జగన్మోహన్ రెడ్డి అని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి జగన్మోహన్ రెడ్డికి అధికారం కట్టబెట్టిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. షర్మిల కుమారుడికి ఆ అవకాశం లేదని తేల్చి చెప్పారు. దీనిపై చాలా రోజులపాటు వాదనలు కొనసాగాయి. మీడియాలో డిబేట్ లు కూడా జరిగాయి.రాజశేఖర్ రెడ్డి వారసత్వం విషయంలో షర్మిల నుంచి తనకు సవాళ్లు ఎదురవుతాయని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. ఇప్పటికే పొలిటికల్ గా ఆమె చాలా డామేజ్ చేశారు. వారసత్వ రాజకీయాల విషయానికి వచ్చేసరికి షర్మిల కుమారుడు రాజారెడ్డి తెరపైకి వస్తే.. తన రాజకీయ వారసత్వం కనుమరుగవుతుందని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. అందుకే తన కుమార్తెలను రాజకీయాల్లోకి తెస్తారని ప్రచారం ప్రారంభం అయింది. అయితే ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి ఆలోచనలు ఎలా ఉన్నాయో ఇంకా బయటపడలేదు. కానీ రాజకీయంగా తన వారసత్వం ఉండాలని ఆయన కోరుకుంటారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. పైగా కుమార్తెలను రాజకీయాల్లోకి తీసుకురావడం ఇది కొత్త కాదు. గతంలో చాలామంది నేతలు ఇలానే వచ్చారు.వచ్చే ఎన్నికల్లో కడప నుంచి అవినాష్ రెడ్డిని తప్పిస్తారని ప్రచారం ఉంది. ఆయనకు బదులు జగన్మోహన్ రెడ్డి కుమార్తెల్లో ఒకరిని పోటీ చేయిస్తారని సోషల్ మీడియాలో అయితే ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి జగన్మోహన్ రెడ్డి కుమార్తెల గురించి సమాచారం ఇప్పుడు బయటకు వచ్చినా సందర్భాలు లేవు. ప్రస్తుతం ఆ ఇద్దరు పిల్లలు చదువు పూర్తి చేసుకుని లండన్ లోనే ఉంటున్నారు. అయితే రాజశేఖర్ రెడ్డి ఉన్నంతవరకు ఆ కుటుంబంలో మహిళలు రాజకీయాల్లోకి రావడం అరుదు. కేవలం రాజకీయ వేదికలపై కనిపించేవారు. కానీ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో ఆ ఇంటి మహిళలు బయటకు వచ్చారు. రాజకీయాల్లో కనిపిస్తున్నారు. ఇప్పుడు వారసత్వ రాజకీయం పుణ్యమా అని జగన్మోహన్ రెడ్డి కుమార్తెల పేరు వినిపిస్తోంది. మరి అందులో ఎంత నిజం ఉందో తెలియాలి.

## గూగుల్ కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి,రిపోర్టర్ బాబు(శుభోదయం న్యూస్):



ఢిల్లీలోని తాజ్ మాన్ సింగ్ హెూటల్ నందు గూగుల్ ప్రతినిధులతో కంపెనీ ఎంఓయు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు పాల్గొన్న అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైటెక్ సిటీ నాడు ప్రపంచ పటంలో హైదరాబాద్ పేరు మార్మోగించిన చంద్రబాబు నాయుడు నేడు విశాఖలో గూగుల్ కంపెనీ రాకతో నవ్యాంధ్ర పేరు మార్మోగే విధంగా చరిత్ర సృష్టించారని అన్నారు.అనంతరం గూగుల్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం అయ్యారు.ఈ కార్యక్రమంలో గూగుల్ కంపెనీ ప్రతినిధులు,పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు,ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి

పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్(శుభోదయం న్యూస్):



ప్రకాశం జిల్లా పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డి కి 72వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ మాట్లాడుతూ మా గుంట శ్రీనివాసులు రెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయనకు ఎన్నో పదవులు వరించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఒక ప్రకటనలో తెలియజేశారు.

## జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన పోలవరం ఎమ్మెల్యే

ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్(శుభోదయం న్యూస్ ):



ఏలూరు జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ శ్రీ ఎం.జె. అభిషేక్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన పోలవరం శాసనసభ్యులు శ్రీ చిర్రి బాలరాజు ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే అధికారితో చర్చించారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్ సీనియర్ టిడిపి నాయకులు జయవరపు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

## ఎంపీడీవో రామనాయక్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమం

తనకల్లు, రిపోర్టర్ రవీంద్ర(శుభోదయం న్యూస్):




తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ లో సూపర్ జిఎస్టి సూపర్ గిఫ్ట్ అవగాహన కార్యక్రమం ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో గారు మాట్లాడుతూ తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ నందు దేశవ్యాప్తంగా తక్కువ జీఎస్టీ రేట్లు వర్తిస్తాయి గతంలో ఎక్కువ జీఎస్టీ ఉండటం వల్ల మధ్యతరగ కుటుంబాలు బడుగు బలహీన వర్గాలు ప్రతి వస్తు పైన జిఎస్టి ఉండేది ఎవరు కూడా కొనలేకపోయేటోళ్లు ఈరోజు దేశవ్యాప్తంగా జిఎస్టి తగ్గించటం వల్ల వ్యాపారస్తులు ప్రజలు చాలా సంతోషపడుతున్నారు జీఎస్టీ ఎప్పుడు తగ్గిందో వ్యాపారాలు కూడా పెరిగాయని నిత్యవసర వస్తువులు దుస్తులు పాదరక్షలు మందులు రోజువారి నిత్యవసర వస్తువులు ఆరోగ్య జీవిత బీమా వీటన్నిటి పైన జిఎస్టి తగ్గించడం వల్ల ప్రజలు చాలా సంతోష పడుతున్నారని అదేవిధంగా డాక్టరు కారు టూ వీలర్ టెలివిజన్ ఎయిర్ కండిషన్ వీటన్నిటి పైన కూడా జిహెచ్ తగ్గించడం వల్ల ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి కొనడానికి బారులు తీరాలని వ్యాపారస్తులు అంటున్నారు పలువురు సంతోష్ పడుతున్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామనాయక్ తనకల్లు హాస్పిటల్ డెవలప్మెంట్ డైరెక్టర్ సోంపాలెం నాగభూషణం క్లస్టర్ ఇంచార్జ్ పీజీ మల్లికార్జున జనసేన సీనియర్ నాయకులు కొట్టి కుమార్ ఎంపిటీసీ అమర్ సర్పంచ్ ఉత్తన్న నాయక్ వివో ఆర్ డి వెంకటేశ్వర్లు సొసైటీ డైరెక్టర్ లక్ష్మన్న వేణుగోపాల్ నాయుడు షామీర్ భాష జనసేన ఫయాజ్ భాష బిసినవారిపల్లి సాంబ రమేష్ నాయక్ రియాజ్ వెంకటరమణ గంగులప్పా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# ఇబ్రహీం మృతి సిపిఎం పార్టీకి తీరని లోటు సిఐటియు నాయకులు

**కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం (శుభోదయం న్యూస్):**

సి.బెళగల్ సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి , మరియు సిఐటియు మండల కన్వీనర్ గా పనిచేస్తున్న ఎస్ ఇబ్రహీం గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ నారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి,యస్, రాధాకృష్ణ, ఎండి అంజిబాబు, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జే మోహన్ లు సి.బెళగల్ లో ఇబ్రహీం పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి ఇబ్రహీం కుటుంబాన్ని ఓదార్చారు,,, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఇబ్రహీం సి.బెళగల్ లో మొదటగా హమాలి సంఘం కార్యదర్శిగా పనిచేస్తూ వచ్చాడని, 2010 నుండి సిపిఎం పార్టీ సభ్యుడిగా శాఖ కార్యదర్శిగా ప్రజా సమస్యల పైన పనిచేస్తూ వచ్చాడని,, ఈ మధ్యకాలంలో సిఐటియు మండల కన్వీనర్ గా కూడా ఎన్నిక అయ్యారని,, సి బెలగల్ సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శిగా మూడుసార్లు ఎన్నికయ్యాడని, ప్రజా, మరియు కార్మికుల సమస్యల పరిష్కార, ఉద్యమాలలో ఇబ్రహీం చురుకుగా పాల్గొనే వాడని, ఇబ్రహీం ప్రజలందరితో సౌమ్యుడిగా ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం దిశగా పోరాడేవారని,, సి బెళ గల్ లో లో నెలకొన్న ప్రజా సమస్యల పైన పోరాటంలో చురుకుగా పాల్గొనేవాడని, ప్రజల




అందరితో మండల పొందిన వ్యక్తిని అటువంటి వ్యక్తి మరణం సిపిఎం పార్టీ ఉద్యమాలకు తీరని లోటని, వారు అన్నారు,, నివాళులర్పించిన వారిలో సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు గూడూరు నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, బెళగల్ సిపిఎం నాయకులు కాజా హుస్సేన్, అక్బర్, సుందర్ రాజు, రంగన్న, బెళగల్ సిపిఐ నాయకులు మల్లికార్జున, ఏఐటీయూసీ అమాలి నాయకులు శేషు, సిఐటియు హమాలి సంఘం నాయకులు జైలు, హుసేనప్ప, నాగేష్, చికెన్ భాష, భాస్కర్, సంటన్న, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు మంగమ్మ, ఉష, శేషమ్మ, రాజకుమారి, జ్యోతి, మార్తమ్మ, మరియు సిఐటియు హమాలీ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్మికులు, తదితర కార్మికులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్నఓజిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి

**పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్(శుభోదయం న్యూస్):**



ఒంగోలు పట్టణ విద్యా సంస్థల అధినేత శ్రీధర్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియ జేసిన ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ ఈ కార్యక్రమంలో కనకం ప్రసాద్, పుప్పాల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బేటి బచావో బేటి పడావో బాలికలను చదివిద్దాం బాలికలను రక్షిద్దాం అవగాహన కార్యక్రమం

**కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం (శుభోదయం న్యూస్):**

సి.బెళగల్ మండల కేంద్రంలో కోడుమూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సి బెళగల్ సెక్టర్ ఆధ్వర్యంలో ఏపీ మోడల్ స్కూల్ నందు,8వ రాష్ట్రీయ పౌష్టిక వారోత్సవాల్లో భాగంగా ఈరోజు భేటీ పడావో బేటి బచావో ఆడపిల్లలను చదివిద్దాం రక్షిద్దాం ప్రతి ఒక్క ఆడపిల్లలను చదివించాలి అవగాహన కార్యక్రమం సి.బెళగల్ సెక్టర్ అంగనవాడి టీచర్లు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ బాలికలను ఉద్దేశించి అంగన్వాడి టీచర్లు మరియు ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు జి చిన్న కులాయమ్మ ఎస్ జ్యోతి మాట్లాడుతూ బాలికలు చదవాలి, బాలికల హక్కుల గురించి బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని తెలుపుతూ సమాజంలో బాలురులతోపాటు బాలికలకు కూడా సమాన హక్కు ఉన్నదని చదువును మధ్యలోనే ఆపేయకుండా లక్ష్యం సాధించేవరకు చదవాలని, బాలికల పై హింస, లింగ




వివక్షత అవగాహన కలిగించారు. అనంతరం బాలికలకు బాలికలను చదివిద్దాం బాలికలను రక్షిద్దాం అనే అంశంపై పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వంశీ మోహన్ రావు, ఐసిడిఎస్ అంగన్వాడి టీచర్లు ఆర్ మహేశ్వరి అనంతమ్మ,మరియమ్మ మేరీ, రాధామ్మ, దస్తగిరమ్మ పాల్గొన్నారు.

# కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం





**కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం (శుభోదయం న్యూస్):**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేద్దామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పిలుపు నిచ్చారు. కర్నూలు పట్టణంలోని స్థానిక ఎన్వీఆర్ హెూటల్ నందు కోడుమూరు నియోజకవర్గంలోని 4 మండలాల టీడీపీ బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి ఇంచార్జిలు, బీజేపీ, జనసేన పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ,ముఖ్య అతిథిగా మీటింగ్ అబ్జర్వర్ కనిగిరి శాసన సభ్యులు ఉగ్ర నరసింహా రెడ్డి ,నియోజకవర్గ పరిశీలకులు కె. రామలింగా రెడ్డి ,బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ బహిరంగ సభ కి డి.విష్ణువర్ధన్ రెడ్డి సారధ్యంలో అభిమానులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు.విష్ణువర్ధన్ రెడ్డి మార్క్ చూపెట్టలన్నారు. అలాగే కే డి సి సి బ్యాంక్ చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వెనుక బడిన మన కోడుమూరు నియోజకవర్గం అభివృద్ధి చేసుకోవాలంటే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభకు ప్రతి గ్రామం నుండి భారీగా తరలి రావాలన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమలు, పెట్టు బడులు వస్తున్న క్రమంలో ప్రధాని చేతులమీదుగా వాటిని ప్రారంభించే లక్ష్యంతో ఇక్కడ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి జీఎస్టీ తగ్గింపు వల్ల రూ.2లక్షల కోట్లు ఆదాయం పడిపోయినా ప్రజా సంక్షేమం కోరి జీఎస్టీ తగ్గించారన్నారు. జీఎస్టీ తగ్గింపు విషయం ప్రజల్లోకి తీసుకోవాల్సిన బాధ్యత కూటమి నాయకు లపై ఉందన్నారు. శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని ప్రధాని దర్శించుకోనున్నట్లు తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. జీఎస్టీ సంస్కరణల తర్వాత తొలిసారి ప్రధాని ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్దేంచిన లక్ష్యానికి మించి జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

## శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి రథోత్సవం

**బ్రహ్మంగారిమఠం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారికి నిప్పు తెచ్చిన శ్రీ కనుమ పోలేరమ్మ ఆలయం వద్ద ప్రతి మంగళ వారం,శుక్రవారం, ఆదివారం రోజున శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి గుడి చుట్టూ ఊరేగింపుగా రథోత్సవంను దేవాదాయ శాఖ కమిషనర్ రామ చంద్రమోహన్ ఆదేశాల మేరకు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నామని మేనేజర్ ఈశ్వరయ్య చారి అన్నారు. మంగళవారం ఉభయ దాతలైనా బి.మఠం మండలం తొట్లపల్లి వాస్తవ్యులు అంకాలరెడ్డి వెంకట సుబ్బారెడ్డి వారి ధర్మపత్ని వెంకటలక్షుమ్మ మరియు భక్తుల మధ్య,రథోత్సవంను నిర్వహించాము,దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకే మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి అమ్మవారి రథోత్సమును నిర్వహిస్తూన్నమని ఈ అవకాశాన్ని భక్తులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందగలరని వారన్నారు. ఈ కార్యక్రమం లో కేశవ పూజారి, పూజారి మిథున్,సిబ్బంది గురు



ప్రసాద్, చిన్న సుబ్బారాయుడు,భక్తులు తదితరులు పాల్గొన్ని రథోత్సవంను జయపదం చేశారు.

## డి. నేలటూరు ఎస్సీ కాలనీని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

**సిపిఐ మండల కార్యదర్శి ప్రభాకర్**

**బ్రహ్మంగారిమఠం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):**



బ్రహ్మంగారిమఠం మండలంలోని డి. నేలటూరు ఎస్సీ కాలనీలో నీరు చేరి ప్రజలు నివసించేందుకు ఇబ్బందిగా ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ........ మండలంలోని దిగువ నెలటూరు ఎస్సీ కాలనీకి పై భాగాన తాతప్ప చెరువు ఉండటం వలన చెరువులో నీళ్లు ఉంటే చెరువు క్రింద ఉన్న ఎస్సీ కాలనీలోకి నీరు ఊటగా వచ్చి ఇళ్లకు ఇబ్బందికరంగా ఉందని ప్రజలు నివసించేందుకు ఇబ్బంది పడుతూ ఊట నీరు ఇళ్లలోకి సైతం ప్రవేశించడంతో బేస్మెంట్ పూర్తిగా దెబ్బతిని కూలిపోయే ప్రమాదం ఉందని ఎప్పుడు కూలిపోతాయో తెలియక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, అదేవిధంగా ఆ మురికి నీరుతో ప్రజలు చిన్నపిల్లలు వృద్ధులు సైతం విషజ్వరాలు రోగాలతో ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి ఎస్సీ కాలనీ ప్రజలకు పునరావాసం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయ నాయకులు గ్రామాల్లో పర్యటించి ఓట్ల కోసం మాత్రమే ప్రజలను వాడుకుంటున్నారు తప్ప ఇటువంటి సమయంలో ఏ ఒక్క రాజకీయ నాయకుడు ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు స్థానిక మైదుకూరు శాసనసభ్యులు మరియు జిల్లా పరిషత్ చైర్మన్ సొంత మండలం అయిన బ్రహ్మంగారిమఠం మండలంలో ఎస్సీ కాలనీ ప్రజలు ఈ విధంగా ఇబ్బంది పడడం దురదృష్టకరం కాబట్టి జిల్లా కలెక్టర్ మరియు స్థానిక రాజకీయ నాయకులు కాలనీవాసులకు పునరావసం కల్పించి వారిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు..

## రేకలకుంట పంచాయతీలో డ్రెయినేజీ సదుపాయాల పరిశీలన

**బ్రహ్మంగారిమఠం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):**



బ్రహ్మంగారిమఠం మండలం రేకలకుంట పంచాయతీ పరిధిలోని టి.రామాపురం, టి.రామాపురం ఎస్సీ కాలనీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు, బి.మఠం టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సబ్బారెడ్డి సూచనలతో, గ్రామాలలో డ్రెయినేజీ కాలువల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు, నాయకులు సంయుక్తంగా కృషి చేస్తున్నారు.ఈ సందర్భంగా టిడిపి మండల యువ నాయకుడు కానాల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యుసిఇ విభాగం ఏఈ వెంకటేశ్వర్లు, రేకలకుంట పంచాయతీ సచివాలయ సెక్రటరీ శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ ఏఈ నాగార్జునలు డ్రెయినేజీ లైన్‌లను పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాలపై నివాసితులతో చర్చించి త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజ్జు రామాంజనేయులు, పుటాల శివ యాదవ్, గంగన్న, మధు, రాజారత్నం,దాసు, డెన్ని, తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ మద్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సిబిఐ చేత విచారణ చేపట్టాలి

**బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):**



అన్నమయ్య జిల్లా మొలకలచెరువు దగ్గర కల్తీ మద్యం ఫ్యాక్టరీ తో పాటు కోట్ల విలువ చేసే కల్తీ మద్యం దొరకడం అక్కడ పనిచేస్తున్న బీహార్ కూలీలు పట్టుబడడం టిడిపి ఇంచార్జ్ జయ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో అద్దేపల్లి జనార్ధన్ రావుకు టిడిపి పెద్దల లింకులు ఉన్నట్లు బహిర్గతం కావడంతో తమ పేర్లు ఎక్కడ బయటికి వస్తాయి అని ముఖ్య నేతలు హడలి పోతున్నారు.జనార్దన్ రావు టిడిపి పెద్దల డైరెక్షన్లో లొంగిపోయేలా డ్రామాకు తెరదీశారు.ఆఫ్రికా నుంచి వస్తున్నప్పుడు జనార్దన్ రావు ఫోన్ పోయిందని తెలపడం . ఇవన్నీ చూస్తుంటే పలు అనుమానాలు దారి తీస్తున్నది దీనివల్ల పెద్ద నాయకుల బండారం బయటపడుతుంద ని. ఫోన్ కనిపించకుండా చేశారు. అందు వల్ల ఇప్పుడు ప్రజలందరికీ అనుమానాలు కలుగుతున్నాయి. చంద్రబాబు నెల్లూరులో మాట్లాడుతూ నకిలీ మద్యంతయారు చేసిన విక్రయించిన వారికి అదే చివరి రోజు అని చెప్పడం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నదని. రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం. ఏలూరు లో పట్టుబడ్డ కల్తీ మద్యం రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేసినట్లుగా అర్థమవుతున్నది. స్పిరిట్ తయారుచేసిన కల్తీ మద్య వల్ల ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఈ ప్రభుత్వంలోని పెద్దల బండారు బయటపడుతుందని. ఇప్పుడు జనార్దన్ రావు తో వైసిపి నాయకుడు జోగి రమేష్ గారు చెప్పడం చూస్తుంటే. ఈ ప్రభుత్వం పై వచ్చిన చెడ్డ పేరును ఇతరులపై వేసేదానికి కుట్ర చేస్తున్నారని అర్థమవుతున్నది కావున ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కచ్చితంగా సిబిఐతో విచారణ చేపట్టాలని . సిట్ వల్ల ముఖ్యమైన నేతలు బయటపడతార నీ అమాయకులైన వారిపై కేసును పక్కదోవ పట్టించేదానికి చేస్తున్న కుట్రని. స్పష్టంగా అర్థమవుతుందనేది తెలుస్తుంది. అని నాగార్జున రెడ్డి అన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ నిర్వహించిన ఇన్ని మెర్ల టిడిపి నాయకులు

పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్(శుభోదయం న్యూస్):



మంగళవారం పామూరు మండలం ఇన్నిమెర్ల గ్రామం నందు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ కార్డులను ఇన్ని మెర్ల గ్రామానికి చెందిన సర్పంచ్ సిద్ధ మూర్తి లక్ష్మీనారాయణ రెడ్డి మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి ఉపసర్పంచ్ బొమ్మనా శ్రీనివాసులు వై తిరుపతయ్య అజయ్ రామ సుబ్బారెడ్డి డీలర్ శ్రీహరి రెడ్డి ఒంటిపెంట మాలకొండ రెడ్డి తదితరులు ఆధ్వర్యంలో స్మార్ట్ కార్డులను పంపిణీ నిర్వహించారు ఈ సందర్భంగా దుగ్గిరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం పేద ప్రజలకు ఎటువంటి అవకతవకలు లేకుండా నేరుగా స్మార్ట్ కార్డు ద్వారా వారు నిత్యవసర సరుకులు ప్రభుత్వ దుకాణం నందు తీసుకొనుటకు ఈ కార్డు ఎంత ఉపయోగపడుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ప్రజలు మరియు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నూతన గృహప్రవేశ మహొత్సవంలో పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు బైరెడ్డి జయరాంరెడ్డి

పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్(శుభోదయం న్యూస్):



ఒంగోలు నగరంలో దర్శి మాజీ శాసనసభ్యులు మద్దిశెట్టి వేణుగోపాల్ మరియు పేస్ ఇంజనీరింగ్ కాలేజ్ అధినేత మద్దిశెట్టి శ్రీధర్ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు మాజీ సింగల్ విండో చైర్మన్ బైరెడ్డి జయరాంరెడ్డి తదుపరి సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మండల ఉపాధ్యక్షులు అంచురి వెంకటరెడ్డి

పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్(శుభోదయం న్యూస్):



కనిగిరి శాసనసభ్యులు డా.ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు పామూరు మండలంలోని గోపాలపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరఫరాలో అక్రమాలను అరికట్టేందుకు ఏర్పాటుచేసిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న పామూరు మండల ఉపాధ్యక్షులు అంచురి వెంకటరెడ్డి ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ టిడిపి నాయకులు,రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు

త్రిపురాంతకం మండల రిపోర్టర్ - గుత్తా మూర్తయ్య(శుభోదయం న్యూస్):



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మెగా డిఎస్సి 2025 కు సంబంధించి త్రిపురాంతకం మండలమునకు స్కూల్ అసిస్టెంట్ లు ముప్పై మరియు సెకండరీ గ్రేడ్ టీచర్లు నాలుగు కేటాయించబడినవి. వారు సోమవారం వారికి కేటాయించబడిన పాఠశాలలో విధులలో చేరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి బోధన అందుతుందని ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు. గ్రామీణ విద్యకు ప్రజా ప్రభుత్వం పునరుజ్జీవం తెచ్చింది ఇప్పటివరకు మారుమూల గ్రామాల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆ సమయంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే చెప్పిన మాట ప్రకారం మెగా డీఎస్సీని ప్రకటించి ఉద్యోగాలు ఇవ్వడం, జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయుల్లో మూడోవంతు మందిని వెనుకబడిన ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి కేటాయించడం విశేషం. దీంతో ఈ ప్రాంతంలో నేటి నుంచి కొత్తగా వచ్చే గురువులతో గ్రామీణ విద్యా వికాసానికి నాంది పలికినట్టయింది. మండల విద్యాశాఖ అధికారి నుండి స్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్స్ లక్ష్మీ ప్రసన్నకు జాయినింగ్ లెటర్ తీసుకున్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలకి ఎంఈఓ చేతుల మీదుగా జాయినింగ్ శుభ పరిమాణం అని పలువురు కొనియాడారు.

# మా పితరుల ఆత్మలు ఘోషిస్తున్నాయి





**- కడనూతల దళితులు**

బిట్రగుంట(శుభోదయం న్యూస్):

మరణించిన మాపితరుల ఆత్మలు సమీపకళాశాల నుండి ప్రవహించే వ్యర్థాల దుర్గంధంతో ఘోషిస్తున్నాయని స్మశానం అభివృద్ధి పేరుతో గత ప్రభుత్వంలో సమాధులను చదును చేయడంతో ఎవరి కుటుంబ సభ్యులను ఎక్కడ పుచ్చామో తెలియక పెద్దలకు పండగ పూట పిండం కూడా పెట్టుకోలేని స్థితిలో ఉన్నామని కడనూతల దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ శాసనసభ్యుడు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి చెందిన ఇంజనీరింగ్ కళాశాల వ్యర్థాలను తమగ్రామ స్మశానం, పంటపొలాలలోనికి వదులుతున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే సారవంతమైన వ్యర్థాలతో కూరగాయలు పండించుకోమని మాజీ శాసనసభ్యుడు వ్యంగంగా సమాధానం ఇచ్చాడని, దుర్గంధం వెదజల్లుతున్న వ్యర్థాలభారి నుండి తమను కాపాడాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ కు కడనూతలవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కమీషన్ సభ్యులు కుల్బీర్ సింగ్, యతి ప్రకాష్ శర్మ, సంజయ్ కుమార్ లతో కూడినబృందం బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పరిసరాలను పరశీలించి విచారణ చేపట్టింది. విచారణ సమయంలో కమిషన్ వెంటకా వలి అన్ని శాఖల అధికారులు మాజీ శాసనసభ్యుడు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, కడనూతల దళిత నాయకులు పైడి హర్ష దాసరిబాబురావు నక్కపుల్లయ్య పత్రిరవి తదితరులు ఉన్నారు.

# భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం





దోర్నాల మండలం, రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్):

ప్రకాశం జిల్లా దోర్నాల మండలం లోని చిన్న గుడిపాడు, కటకానిపల్లి గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం, ఒంగోలు వారు భూసార పరీక్షా ఫలితాల కార్డుపై అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. డి. ఆర్. సి. వ్యవసాధికారి వి. వి. శేషమ్మ భూసార పరీక్షా ఫలితాల కార్డు గురించి వివరించి వీటి ఆధారంగా వివిధ పంటలలో ఎరువుల యాజమాన్యం, జీవన ఎరువుల వాడకం గురించి వివరించారు. భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయాధికారి డి. స్వరూప సమగ్ర ఎరువుల యాజమాన్యం ద్వారా రైతులు సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. మండల వ్యవసాయధికారి డి. జవహర్ లాల్ నాయక్ వ్యవసాయ పథకాలు, ఈ పంట గురించి వివరించారు. భూసార పరీక్షలపై అవగాహన అనంతరం ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ నందు 9 తరగతి విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం గురించి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి డి. జవహర్ లాల్ నాయక్ గారు నేల ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి వివరించారు. ఒంగోలు భూసార పరీక్షా కేంద్రం ఎ. ఒ. డి. స్వరూప గారు మట్టి నమూనా సేకరణ, పరీక్షా విధానం, మొబైల్ అప్లికేషన్, టెస్టింగ్ పరికరాలు మరియు పనిచేసే విధానం గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారి శేషమ్మ మట్టి నమూనా సేకరించే డెమో గురించి వివరించి, చేసి చూపించినారు. ఈ కార్యక్రమం లో స్కూల్ టీచర్స్, వి. ఎ. ఎ. మరియు స్టూడెంట్స్ పాల్గొన్నారు.

# ప్రపంచ ప్రజల విముక్తి తత్త్వవేత్త,జ్ఞాన జ్యోతి గౌతమ బుద్ధుని విగ్రహ ఆవిష్కరణ

వెంకటగిరి నియోజకవర్గం, ఇంచార్జ్ వీసీ సుబ్బరాయుడు(శుభోదయం న్యూస్):



తిరుపతి జిల్లా, దక్కిలి మండలం, వెంబులూరు, అంబేద్కర్ నగర్ లో అంబేద్కర్ ధర్మ పోరాట సమితి అధ్యక్షులు గుండుగోలు గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా గౌతమ బుద్ధుని విగ్రహావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఇడోరా బుద్ధ విహార్ నుంచి విచ్చేసిన బంతేజీ దమ్మానంద బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించి బుద్ధుని ప్రవచనాలైనా అష్టంగా మార్గాలు, పంచశీల బోధించారు. 1956 అక్టోబర్ 14వ తేదీన స్వేచ్ఛ సమానత్వం సౌభ్రతత్వం కేంద్రంగా కలిగిన బౌద్ధ ధర్మాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఐదు లక్షల మంది తో స్వీకరించడం జరిగిందని తెలియజేశారు. అన్నీ మతాలన్నీ దేవుడు కేంద్రంగా కలిగి ఉంటాయని బౌద్ధం మాత్రం నీతి కేంద్రం కలిగి ఉంటుందని తెలియజేశారు. ఈ భారత దేశంలో బుద్ధుని తర్వాత యుద్ధ పిపాసిగా పరిపాలించిన అశోక చక్రవర్తి బౌద్ధాన్ని స్వీకరించి సమతా రాజ్యాన్ని స్థాపించి నేపాల్, చైనా, బర్మా,మయన్మార్ మొత్తం ఆసియా ఖండం కూడా బౌద్ధంతో నింపారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ధర్మ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అయినటువంటి మాస్టర్ రామచంద్రరావు ఇంగిలాల. ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రపంచ ప్రజల విముక్తి ప్రదాతలుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గౌతమ్ బుద్ధుని సిద్ధాంతాలే ఈ ప్రపంచంలో పీడిత ప్రజల విముక్తి మార్గాలు వీరు మాత్రమే అని ప్రపంచ గురువులని తెలియజేశారు. ప్రజలందరూ మూఢనమ్మకాలు నుంచి బయటపడి అజ్ఞానం నుంచి జ్ఞానం లోకి అడుగు పెట్టాలని సూచించారు. మనుషులంతా సమానత్వమేమనని చాటిచెప్పిన ఏకైక మతం బౌద్ధమేనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎరబోతు సుబ్రహ్మణ్యం, నిజమల ప్రసాద్, చిట్టేటి రమణయ్య, జంగిటి వెంకటయ్య నావూరు శంకర్, అంబేద్కర్ నగర్ గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# పాములు భయంతో విద్యార్థుల అవస్థలు






**వెంకటగిరి నియోజకవర్గం, ఇంచార్జ్ వీసీ.సుబ్బరాయుడు(శుభోదయం న్యూస్):**

తిరుపతి జిల్లా దక్కిలి మండలం డి వడ్డిపల్లి గ్రామ పంచాయితీ లో గల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నంత పాఠశాల లో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి దయానియంగా తయారైంది. గ్రామంలో ఉన్నంత పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు స్కూల్ ప్రహరీ గోడ పక్కనే ఉన్నటువంటి చెట్లు బాగా పెరిగిపోయి పాఠశాల లోపలికి రావటంతో అక్కడి నుండి విష పురుగులు పాములు స్కూల్ లోపలకి వస్తున్నాయి అని పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. స్కూల్ హెడ్మాస్టర్ మండల ఎంఈఓ పంచాయతీ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోక పోవడంతో పిచ్చి చెట్లు పెరిగిపోయి దట్టమైన పొదలుగా మారావి. దీనితో స్కూల్ ప్రాంగణంలో స్కూల్ నుంచి నడచి వెళ్ళే దారిలో విషసర్పలు సంచరిస్తు ఉండంతో విద్యార్థులు భయందోళనకు గురౌతున్నారు... కార్పొరేట్ స్కూల్ కు దిటుగా ప్రభుత్వ బడులు ఉన్నాయని గొప్పలు చెప్పుకొనే దక్కిలి మండల ఎంఈఓ ఇంకనైనా స్పందించాలని విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి స్కూల్లోని కనీస వసతులు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ అధికారుల అలసత్వం వల్ల పిల్లల జీవితాలపై ప్రభావం పడుతోంది. ఇకనైనా అధికారులు స్కూల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజలు కోరుకొంటున్నారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి ర్ గవాయి పైన దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**వెంకటగిరి నియోజకవర్గం, ఇంచార్జ్ వీసీ సుబ్బరాయుడు(శుభోదయం న్యూస్)**




తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలో ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయం నందు భారతదేశం యొక్క అత్యున్నత న్యాయస్థానం అయినటువంటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి ఆర్ గవాయి పైన కోర్టు సమయంలో ఈ మధ్యకాలంలో జరిగినటువంటి దాడిని ఖండిస్తూ ఈరోజు ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య ఆధ్వర్యంలో విలేఖరి సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయి పైన జరిగిన దాడిని ఈ దేశంలోనే దళితుల యొక్క ఆత్మ గౌరవం పైన. ఈ దేశం యొక్క ప్రజాస్వామ్యం పైన. ఈ దేశం యొక్క రాజ్యాంగం పైన జరిగిన దాడిగా మేము భావిస్తున్నాము అని తెలియజేశారు ఈ దేశంలో ఈ మధ్యకాలంలో కింద స్థాయి నుండి అత్యున్నత స్థాయిలో ఉన్న దళిత దళిత ఇతర కులాల మనువాద కుల రాక్షసుకు గురికావాల్సి వస్తుందని ఈ మధ్యకాలంలో జరిగినటువంటి హర్యానా రాష్ట్రంలో ఒక ఐపీఎస్ ఆఫీసర్ పురాన్ కుమార్ గారి సంఘటనే సాక్షాత్తు మనకు నిదర్శనం భారతదేశంలో పురాతన కాలంలో అమలు చేసిన కుల రాక్షసి విధానం మరల పునరావృతం అడుగులు వేస్తుందని చెప్పడానికి ఈ మధ్యకాలంలో భారతదేశంలో దళిత ఇతరులకు పైన జరుగుతున్న దాడులే నిదర్శనం కాబట్టి ఈ దేశంలోనే మనవాద ఇతర అన్ని వర్గాల అన్ని మతాల అన్ని కులాల ప్రజలు ప్రజాస్వామ్యవాదులు మేధావులు ప్రజా సంఘాలు ఇలాంటి సంఘటనలను ఖండించాలని మేము విజ్ఞప్తి చేస్తూ పిలుపునిస్తున్నాం అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు బండి రవి. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# ఏలూరు జిల్లా టి నరసాపురం మండలంలో క్రాకర్ దుకాణాలపై భద్రతా తనిఖీలు

**టీ నర్సాపురం మండలం, రిపోర్టర్ మంగరాజు (శుభోదయం న్యూస్):**



ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ వారు రాబోయే పండుగల సందర్భంగా ప్రజల భద్రత ను దృష్టిలో ఉంచుకుని పోలవరం డీఎస్పీ శ్రీ ఎం. వెంకటేశ్వరరావు యొక్క ఆదేశాలపై టి నరసాపురం ప్రాంతంలో క్రాకర్ దుకాణాలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీ బృందంలో జీలుగుమిల్లి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు టి. నరసాపురం ఎస్ఐ జయ బాబు ఎంఆర్ఓ (తహశీల్దార్) పంచాయతీ కార్యదర్శి, మరియు అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.లైసెన్స్ పొందిన అగ్ని పటాకుల దుకాణాలను ఈ బృందం సంయుక్తంగా తనిఖీ చేసి, అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై యజమానులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.చెల్లుబాటు అయ్యే లైసెన్స్ ఉన్న దుకాణాలకే అమ్మకాలకు అనుమతి ఉంటుంది. బాణా సంచా దుకాణాలు నివాస గృహాలు, పాఠశాలలు (స్కూల్స్), పెట్రోల్ బంకుల నుండి కనీసం 50 మీటర్ల దూరంలో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. బాణా సంచా దుకాణాల నిర్మాణం అగ్ని నిరోధక పదార్థాలతో (టిన్/ఆస్బెస్టాస్ షీట్లు) మాత్రమే చేయాలి. ప్రతి బాణా సంచా దుకాణంలో నీరు, ఇసుక బిందెలు మరియు ఫైర్ ఎక్స్టింగ్విషర్ తప్పనిసరిగా సిద్ధంగా ఉంచాలి.బాణా సంచా దుకాణాల వద్ద ధూమపానం, దీపాలు వెలిగించడం మరియు మొబైల్ వాడకం పూర్తిగా నిషేధం చెయ్యాలి.బాణా సంచా దుకాణంలో ఉపయోగించే విద్యుత్ వైరింగ్ సురక్షితంగా మరియు ప్రమాద రహితంగా ఉండాలి. బాణా సంచా లైసెన్స్ ప్రకారం మాత్రమే పరిమిత పరిమాణంలో పటాకులు నిల్వ చేయాలి. రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి విక్రయాలు చెయ్యకూడదు. వినియోగదారులకు బాణా సంచా వాడేటప్పుడు తీసుకోవాల్సిన భద్రతా సూచనలు తప్పనిసరిగా తెలియజేయాలి. అత్యవసర నంబర్లు (ఫైర్, పోలీస్, రెవెన్యూ) స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలి. చిన్నపిల్లలకు పెద్దవారి పర్యవేక్షణ లేకుండా పటాకులు అమ్మరాదు. అగ్నిమాపక శాఖ అధికారులు అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి ట్యాంకర్లు మరియు సిబ్బందిని నిరంతరం సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ మరియు ఫైర్ డిపార్ట్మెంట్ల సమన్వయంతో నిర్వహించిన ఈ తనిఖీలు, పండుగల సందర్భంగా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడంలో ఏలూరు జిల్లా యంత్రాంగం యొక్క నిబద్ధతను తెలియజేస్తున్నాయి. ఎవ్వరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## పోగొట్టుకున్న బంగారపు వస్తువులను తిరిగి అందజేసిన ఎస్ఐ చంద్రశేఖర్

**ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్(శుభోదయం న్యూస్):**

ఏలూరు జిల్లా మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణానికి చెందిన ముప్వ శ్రీలక్ష్మి జంగారెడ్డిగూడెం వెళుచుండగా ఆమె కు చెందిన 2 బంగారపు గాజులు, ఒక గొలుసు పడిపోవడంతో , సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా పోలీస్ సిబ్బంది గుర్తించి శ్రీలక్ష్మి పోగొట్టుకున్న బంగారపు వస్తువులను ఆమె కు మంగళవారం ఎస్సై చంద్రశేఖర్ ఆయన సిబ్బందితో కలిసి అందజేశారు. పోయిన బంగారపు వస్తువులను తిరిగి తనకు నెతికి ఇచ్చిన ఎస్సై చంద్రశేఖర్ కు ఆయన సిబ్బందికి శ్రీలక్ష్మి హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



## రైతులకు యూరియా పంపిణీ చేసిన కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు.

**పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్(శుభోదయం న్యూస్):**



పామూరు మండలం నుచ్చుపోత గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న!కనిగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు గోళ్ళ సూర్య ప్రకాష్, పామూరు పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి, నుచ్చు పోత గ్రామ టిడిపి ఉపాధ్యక్షుడు మండ్ల మల్లికార్జున, పామూరు యూనిట్ ఇంఛార్జీ ఇర్రి శ్రీనివాసులు, వంకదారి వెంకటేశ్వర్లు,వ్యవసాయ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు

## శ్రీకాళహస్తీశ్వరని దర్శించుకున్న ఏపీఎన్జీవో అధ్యక్షుడు

**శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు(శుభోదయం న్యూస్):**



ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ మంగళవారం ఉదయం శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు.స్థానిక ఎన్జీవో నాయకులు ఆయనకు స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాట్లు చేశారు.దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వాదం ఇప్పించి స్వామి అమ్మ వాళ్ళ తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్జీవో అధ్యక్షుడు చెంచురత్నంయాదవ్ సంయుక్తకార్యదర్శి బాలచంద్ర యాదవ్,తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ రాఘవులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి

**ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్):**



అనారోగ్యంతో ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో సహాయ పడుతుందని పోలవరం నియోజకవర్గం శాసనసభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మండలంలో సరిపల్లి, అచ్చుతాపురం, పరింపుడి, ఎర్రంపేట, బయ్యన్నగూడెం గ్రామాలకు చెందిన మందపాటి వెంకటేశ్వరరావు, తాడేపల్లి సత్యవతి, లంక శ్రీనివాస్, కంచర్ల రాజేష్, వరద వెంకట్రావు, టెక్కం సోమ సాయి గణేష్ లకు చిర్రీ బాలరాజు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేయడం జరిగిందని మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట రవి తెలిపారు. ఆపదలో ఉన్న వారి కుటుంబాలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో దోహదపడుతుందని బాలరాజు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం అన్నివేళలా ముందుంటుందని రవి తెలిపారు.

## శ్రేష్ఠ పథకం ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయండి సామాజిక కార్యకర్త బాబురావు

**గుంతకల్లు, ప్రతినిధి పల్లె రామాంజనేయులు(శుభోదయం న్యూస్):**



శ్రేష్ఠ పథకం ఎస్సీ ఎస్టీ విద్యార్థిని విద్యార్థులకు అందనంత దూరంలో ఉందని వాటికి న్యాయం చేయాలని సామాజిక కార్యకర్త బాబురావు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2002 సంవత్సరంలో సామాజిక న్యాయం సాధికారత ఉన్నత విద్య మంత్రిత్వ శాఖ లు ఎస్సీ విద్యార్థుల పురోగతి కోసం శ్రేష్ఠ పథకాన్ని ప్రవేశపెట్టారు దీని ద్వారా 8 9 10 తరగతి విద్యార్థులు ఎంపిక చేసి జాతీయ ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక కార్యక్రమాలు నిర్వహిస్తారు ఇందులో ఉత్తీర్ణైన వారికి దేశంలో ఉన్న అత్యున్నత ప్రైవేట్ కళాశాలలో ప్రభుత్వం ఉచితంగా ప్రవేశాన్ని కల్పిస్తుంది వీరికి సంబంధించిన ఫీజులు కూడా కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. జీవో ఎంఎస్ నెంబర్ 20 తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇతర రాష్ట్రాల్లో చదివి విద్యార్థులను స్థానికేతరులుగా నాన్ లోకల్ గా గుర్తిస్తారు దీని కారణంగా ఎస్సీ విద్యార్థులు ఎంబిబిఎస్ ఇంజనీరింగ్ ట్రిపుల్ ఈ కోర్సులలో అవకాశాన్ని కోల్పోతున్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో నిర్ణయాలు తీసుకొని ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయాలని బాబురావు కోరారు



# లిటిల్ హార్ట్స్ మౌళికి భారీ రెమ్యునరేషన్‌తో మైత్రీ సినిమా!

లిటిల్ హార్ట్స్ సినిమాతో నటుడు మౌళి భారీ క్రేజ్ తెచ్చుకున్నాడు. గతేడాదిలో 'హ్యాష్‌ట్యాగ్ 90%ం%' అనే వెబ్ సిరీస్‌తో యూత్‌కు బాగా దగ్గరైన మౌళి తన టైమింగ్ డైలాగ్స్‌తో గుర్తింపు సంపాదించాడు. హీరోగా తొలి సినిమా 'లిటిల్ హార్ట్స్'తో బాక్సాఫీస? వద్ద కాసుల వర్షం కురిపించాడు. ఇప్పుడు పెద్ద నిర్మాతలు కూడా తనతో ఒక సినిమా చేద్దాం అనుకునే రేంజ్‌కు చేరుకున్నాడు. కొత్త దర్శకులు కూడా ఇప్పటికే స్టోరీ చెప్పేందుకు రెడీ అవుతున్నారు. ఈ క్రమంలోనే ఒక భారీ నిర్మాణ సంస్థ నుంచి మౌళికి బిగ్ ఆఫర్ వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. చిన్న సినిమాగా విడుదలైన లిటిల్ హార్ట్స్ బాక్సాఫీస్ వద్ద రూ. 40 కోట్లకు పైగానే కలెక్షన్స్ రాబట్టింది. ఓటీటీలో కూడా ఈ చిత్రం దూసుకుపోతుంది. దీంతో అతని మార్కెట్ కూడా పెరిగింది. ఇప్పుడు మౌళికి ఏకంగా మైత్రీ మూవీ మేకర్స్ నుంచి సినిమా ఆఫర్ ఇవ్వడమే కాకుండా అడ్వాన్స? కూడా ఇచ్చేశారని తెలుస్తోంది. ఏకంగా రూ. కోటి రెమ్యునరేషన్ కూడా వారు ఇస్తామని చెప్పినట్లు సమాచారం. కేవలం రెండో సినిమాకే ఈ రేంజ్ రెమ్యునరేషన్ ఇస్తామని చెప్పడం పెద్ద విషయమేనని చెప్పాలి. ఒక సినిమా హిట్ అయినప్పటికీ మరో ఛాన్స్ రావడం కష్టంగా ఉన్న ఈరోజుల్లో ఒక పెద్ద నిర్మాణ సంస్థ తన వద్దకే వచ్చి ఇలా ఆఫర్ ఇవ్వడం అంటే సాధారణ విషయం కాదు. దీనంతటికీ కారణం మౌళికి యూత్‌తో బాగా కనెక్ట్ ఉంది. సోషల్‌మీడియాలో భారీ ఇమేజ్ ఉంది. అందుకే తనకు మైత్రీ మూవీస్ సినిమా అవకాశం ఇచ్చినట్లు టాక్. ఈ సినిమా గురించి మరిన్ని వివరాలు త్వరలో రావచ్చు.



# డిఫరెంట్ లుక్‌లో శ్రీలీల.. పోస్ట్ వైరల్

యంగ్ సెన్సేషన్ శ్రీలీల.. ఈ ఏడాది 'రాబిన్‌హుడ్', 'జూనియర్' సినిమాలతో వచ్చింది. కానీ ఈ రెండు బాక్సాఫీస్ దగ్గర ఫెయిలయ్యాయి. ఈనెల 31న 'మాస్ జాతర' మూవీతో రానుంది. దీనిపై పెద్దగా అంచనాలైతే లేవు. ఇవి కాకుండా తెలుగు, తమిళ, హిందీలో తలో చిత్రం చేస్తోంది. ఇప్పుడు ఇన్ స్టాలో కొత్తగా ఓ ఫొటో పోస్ట్ చేసింది. ఇప్పుడిది ఏంటా అనే క్వశ్చన్ మార్క్‌గా మారింది. 'ఏజెంట్ మిర్చి'గా శ్రీలీల.. అక్టోబరు 19న ప్రకటన రానుందని చెబుతూ ఓ ఫొటోని ఇన్ స్టాలో పోస్ట్ చేసింది. ఇందులో గ్లామరస్‌గా రఫ్ అండ్ టఫ్ లుక్‌లో కనిపించింది. క్యాప్షన్ చూస్తుంటే ఇదేదో హిందీ ప్రాజెక్టులా అనిపిస్తుంది. అయితే అది సినిమానా లేదా వెబ్ సిరీస్ అనేది క్లారిటీ రావాల్సి ఉంది. ఇవేం కాకుండా యాడ్ లాంటిది అయినా ఆశ్చర్యపోనక్కర్లేదు.ఇకపోతే శ్రీలీల ప్రస్తుతం పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్', శివకార్తికేయన్ 'పరాశక్తి', కార్తిక్ ఆర్యన్‌తో ఓ రొమాంటిక్ సినిమా చేస్తోంది. ఇండస్ట్రీలో ఈ బ్యూటీ నిలబడాలంటే ఇవి కచ్చితంగా హిట్ కావాల్సిన పరిస్థితి. ఎందుకంటే హీరోయిన్‌గా కెరీర్ మొదలుపెట్టిన వరస చిత్రాల్లో నటించింది. కాకపోతే 'ధమాకా', 'భగవంత్ కేసరి'తో పాటు 'పుష్ప 2'లో ఐటమ్ సాంగ్ తప్పితే మిగతావి ఏవి ఉపయోగపడలేదు. ఇప్పుడు చేస్తున్న మూవీస్‌పై కాస్త బజ్ ఉంది. మరి శ్రీలీల లక్ ఏమవుతుందో చూడాలి?

## థామాలో రష్మిక-మలైకా స్పెషల్ డ్యాన్స్.. 'పాయిజన్ బేబీ' వీడియో చూశారా.!




బాలీవుడ్‌లో హారర్-కామెడీ స్త్రీ యూనివర్స్ నుంచి మరో బ్లాక్‌బస్టర్ సిద్ధమవుతోంది. మడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'థామా'. ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబరు 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌లో భాగంగా సినిమా నుంచి 'పాయిజన్ బేబీ' అంటూ సాగే స్పెషల్ వీడియోను విడుదల చేశారు. ఈ సాంగ్‌లో రష్మిక మందన్నా, మలైకా అరోరా తమ డ్యాన్స్‌తో అభిమానులకు పిచ్చెక్కిస్తున్నారు. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో రూపొందిన ఈ హారర్-కామెడీ, మడాక్ యూనివర్స్‌లోని ఐదో చిత్రం ('స్త్రీ', 'భేదియా', 'ముంజ్యా', 'స్త్రీ 2' తర్వాత థామా).

# నేను భయపడ్డా కానీ ఊహించినంత ఏం జరుగలేదు.. పెళ్లిపై కీర్తిసురేశ్



మహానటి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కీర్తిసురేశ్. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతోంది. సుదీర్ఘ కాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్న కీర్తిసురేశ్, ఆంటోనీ థట్టిల్ ఫైనల్‌గా 2024లో వివాహబంధంతో ఒక్కటయ్యారు. తన కాలేజీ రోజుల్లో లవ్ స్టోరీ గురించి చెబుతూ తాము పెళ్లి చేసుకోవడానికి 15 ఏళ్ల వెయిట్ చేశామంది. జగపతిబాబు టాక్ షో జయమ్ము నిశ్చయమ్మురా టాక్ షోలో ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకుంది కీర్తిసురేశ్.కీర్తిసురేశ్, ఆంటోనీ రిలేషన్‌షిప్ 2010లో మొదలైందట. ఈ విషయంపై కీర్తిసురేశ్ మాట్లాడుతూ.. తాను సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చేకంటే ముందు 2010 ఇద్దరి రిలేషన్‌షిప్ మొదలుపెట్టినట్టు చెప్పారు. నేను కాలేజీ పూర్తి చేసి నా కెరీర్‌పై ఫోకస్ పెట్టాలనుకున్నా. ఐదారేళ్లు లాంగ్ డిస్టేన్స్ రిలేషన్‌షిప్‌లో ఉన్నాం. అతను ఖతార్‌లో ఉంటే.. నేను చెన్నైలో ఉన్నా. అతడు ఇండియా వచ్చిన తర్వాత మేమిద్దరం సెటిల్ అవ్వడానికి టైం కావాల్సి వచ్చింది. తమ మధ్య మతపరమైన విబేధాల కారణంగా నా కుటుంబం మా ఇద్దరి పెళ్లిని ఒప్పుకోదేమోనని భయపడ్డా. ఇంట్లో మతం సమస్యగా మారొచ్చని అనుకున్నాం. నాలుగేళ్ల క్రితం నాన్నతో ఆంటోని గురించి మాట్లాడాను. ఆయన చాలా తేలికగా పని అయిపోయేలా చేశారు. నేను ఊహించనంతగా అసలేం జరుగలేదంది కీర్తిసురేశ్.



# సంక్రాంతికి రెడీ అవుతున్న 'మన శంకర వరప్రసాద్ గారు'

## 'మీసాల పిల్ల' ఫుల్ సాంగ్‌తో అంచనాలు పీక్స్‌లో!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా, లేడీ సూపర్‌స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ చిత్రంలో విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. 2026 సంక్రాంతి బరిలో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. ఇటీవల దసరా సందర్భంగా విడుదలైన 'మీసాల పిల్ల' ఫస్ట్ సింగిల్ ప్రోమో మెగా అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. చిరంజీవి గ్రేస్, ఎనర్జీతో చేసిన స్టెప్పులు, భీమ్స్ సిసిరీలియో ఇచ్చిన బీట్ ఫ్యాన్స్‌ను ఫుల్ ఉత్సాహంలోకి తెచ్చాయి. ఇప్పుడు ఆ పాట ఫుల్ లిరికల్ వీడియో కోసం ఎదురుచూస్తున్న అభిమానుల కోసం ఫుల్ సాంగ్ విడుదల చేశారు. ఈ సాంగ్ శ్రోతలని ఎంతగానో ఆకట్టుకుంది. లిరిక్స్ చాలా క్యాచీగా ఉన్నాయి. ఉదిత్ నారాయణ చాలా రోజుల తర్వాత చిరు సినిమా కోసం వాయిస్ అందించారు. దీంతో సాంగ్‌పై హైప్ మరింత పెరిగింది. 'మీసాల పిల్ల' పాటకు భీమ్స్ సిసిరీలియో ఎనర్జిటిక్ మ్యూజిక్ అందించిన విషయం తెలిసిందే. చిరంజీవి స్టెప్పులు, అనిల్ మాస్ ట్రీట్మెంట్ కలిస్తే ఈ పాట సంక్రాంతి సెన్సేషన్ అవుతుందనే అంచనాలు పెంచేసింది. మొత్తానికి, 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్‌డేట్ మెగా అభిమానుల్లో కొత్త ఉత్సాహం నింపుతోంది. 'మీసాల పిల్ల' ఫుల్ సాంగ్ విడుదల కావడంతో మెగా ఫ్యాన్స్ సంబరాల్లో మునిగిపోయారు. కాగా, . గతంలో ఉదిత్ నారాయణ చిరంజీవి కోసం 'కైకలూరి కన్నేపిల్లా', 'రామ్మా చిలకమ్మా', 'వానా వానా', 'రాధే గోవింద' వంటి సూపర్‌హిట్ సాంగ్ పాడారు. చాలా రోజుల తర్వాత ఇప్పుడు మన శంకర వరప్రసాద్ గారు కోసం మీసాల పిల్ల పాట పాడి ఛార్ట్‌బస్టర్ చేశారు. ఈ పాట ఇంత సక్సెస్ కావడం పట్ల ఫ్యాన్స్ కూడా ఫుల్ ఖుషీ అవుతున్నారు

## 'కాంతార'కు అక్కడ మాత్రమే భారీ నష్టాలు



కన్నడ సినిమా కాంతార చాప్టర్ 1 ప్రపంచవ్యాప్తంగా భారీ కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. ఇప్పటికే రూ. 500 కోట్ల క్లబ్‌లో చేరిపోయిన ఈ చిత్రం కలెక్షన్ల జోరు మాత్రం తగ్గడం లేదు. సోమవారం కూడా సుమారు రూ. 20 కోట్లకు పైగానే రాబట్టినట్లు బాక్సాఫీస్ వర్గాలు చెబుతున్నాయి. 12 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.675 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు తెలుపుతున్నాయి. దీంతో బాహుబలి-1 ఫైనల్ కలెక్షన్స్ మార్క్‌ను కాంతార దాటేసింది. అయితే, కాంతారా చాప్టర్ 1 అమెరికాలో బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు రాబట్టినప్పటికీ గణనీయమైన నష్టాలను చవిచూసే ఛాన్స్ ఉంది. ఇప్పటివరకు, ఈ చిత్రం దాదాపు రూ. 4 మిలియన్ల డాలర్స్ (రూ. 36 కోట్లు) వసూలు చేసింది. అందుకు సంబంధించిన పోస్టర్‌ను కూడా తాజాగా మేకర్స్ షేర్ చేశారు. ఈ కలెక్షన్స్ నంబర్ పర్వాలేదనిపించినప్పటికీ బ్రేక్-ఈవెన్ మార్కుకు చాలా దూరంలో ఉంది. ఈ సినిమాను చాలా ఎక్కువ ధరకు అమెరికాలో కొనుగోలు చేశారని తెలుస్తోంది. ఈ మూవీ బ్రేక్ ఈవెన్ చేయడానికి దాదాపు రూ. 8 మిలియన్ల డాలర్స్ అవసరం అవుతుంది. ఆ మార్క్‌ను కాంతార అందుకోవడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. దీంతో అమెరికాలో కాంతార నష్టాలు మిగల్చడం తప్పదని సమాచారం. అయితే, తెలుగు, కన్నడ, తమిళ్, హిందీ బెల్ట్‌లో మాత్రం భారీ లాభాల దిశగా కాంతార దూసుకుపోతుంది. దీపావళి సందర్భంగా ఈ వారంలో మరో నాలుగు ప్రధాన సినిమాలు విడుదల కానున్నడంతో కాంతారా చాప్టర్ 1 కలెక్షన్స్ ప్రపంచవ్యాప్తంగా మరింత తగ్గే ఛాన్స్ ఉంది. ఏదేమైనా మరో మూడు రోజులు మాత్రమే కాంతార సందడి కనిపించనుంది. ఈ ఏడాదిలో ఛావా సినిమా రూ. 800 కోట్ల కలెక్షన్స్‌తో టాప్ వన్‌లో ఉంది. ఇప్పుడు కాంతార కూడా ఆ మార్క్‌ను అందుకోవాలని చూస్తుంది. 2022లో విడుదలైన కాంతార చిత్రానికి ప్రీక్వెల్‌గా కాంతార చాప్టర్ 1 నిర్మించారు. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రుక్మిణి వసంత్, జయరామ్, గుల్షన్ దేవయ్య కీలక పాత్రల్లో నటించారు.